MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 22 సంచిక: 7 రంగారెడ్డి మార్చి 2024 పేజీలు : 36 వెల : రూ. 10/-

## 'పర్యావరణ సమ్మిళిత వ్యవసాయం' పై స్మరజిత్ రే స్మారక ప్రసంగం !





జ్యోతి ప్రజ్వలన , ప్రసంగం : శ్రీ సి ఎస్ రెడ్డి, డాక్టర్ దేవీందర్ శర్మ , శ్రీమతి నందితా రే, శ్రీ కె. మాధవరావు, శ్రీమతి కళామణి , సమావేశానికి ప్రత్యక్షంగా హాజరైనవారు



జాతీయ ఆదర్శ స్వయంసహాయ సమాఖ్యలకు ఏపిమాస్ శిక్షణ !








వృత్తి , సి ఎం ఎస్ సంస్థల బృందాలు ఎం టమాట , రేనాటి ఎఫ్ పి ఓ లను సందర్శించిన దృశ్యాలు

NABARD
నాబార్డ్ సౌజన్యంతో ....

మీకు తెలుసా ?

గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - ❖ దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - ❖ 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - ❖ మొత్తంగా పంట దిగుబడులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...



వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...

ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ... ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!

## మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

## వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

# మహిళా సాధికారత

సంపుటి 22 సంచిక 7




సంపాదకీయం

## పర్యావరణం !

విశ్వాంతరాళంలో కేవలం భూమి మీద మాత్రమే ప్రాణులు నివసిస్తున్నాయి. తక్కిన ఏ గ్రహంలోకాని, అంతరిక్ష ంలో మరెక్కడ కాని జీవరాశి జాడ లేదు. గ్రహాంతరవాసులు వున్నారని కథలు, కల్పనలు ఎన్ని వినిపించినా యింతవరకు అవేవీ నిర్ధారణ కాలేదు. అక్కడ ఎక్కడా ప్రాణుల మనుగడకు అనుకూలమైన పరిస్థితులు లేవని, అందువల్ల మరెక్కడా జీవరాశి వుండే అవకాశంలేదనే శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మరి ప్రాణుల మనుగడకు ఎక్కడా లేని సానుకూలత భూమిపైనే ఎందుకంటే, భూమిని ఆవరించి వున్న పర్యావరణ రక్షణ కవచమే అందుకు కారణం. అందువల్ల ఈ రక్షణ కవచం భద్రంగా వున్నంతవరకే మన మనుగడ! ఏ కారణం వల్లనైనా పర్యావరణం దెబ్బతింటే అది సకలప్రాణికోటి మనుగడకే ముప్పు తెస్తుంది. ఈ కారణంగానే పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రపంచవ్యాప్తంగా ఎంతగానో ఆందోళన వ్యక్తమవుతున్నది. పర్యావరణం దెబ్బతినడానికి ఎలాంటి అవకాశం యిచ్చినా అది మన వినాశనాన్ని మనమే కోరి తెచ్చుకున్నట్టు. పర్యావరణానికి హాని కారకాలు అనేకం వున్నాయి. కాని, వాటిలో ముఖ్యమైనవి భూమి, గాలి, నీరు, ఆహార కాలుష్యాలు. తిరిగి వీటికి ప్రధాన మూలం మన వ్యవసాయ విధానంలో, ఆహారపదార్ధాలను సమకూర్చుకునే తీరులో వుంటుంది. ఇది ఒక విష వలయం! జనాభా పెరిగే కొద్దీ ఆహార పదార్ధాల అవసరం పెరుగుతుంది. ఆ తక్షణ అవసరాన్ని తీర్చుకోడానికి ఇబ్బడి ముబ్బడిగా వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకోవడం ఒక్కటే మార్గమని భావించి, రసాయనిక వ్యవసాయానికి సమధికోత్సాహంతో స్వాగతం పలకడం, దుష్ఫలితాల హెచ్చరికలను పెడచెవినపెట్టి భారీగా దిగుబడులను పెంచుకోవడానికి పరస్పరం పోటీపడి విచక్షణ రహితంగా రసాయనిక ఎరువులను, పురుగు మందులను దశాబ్దాలుగా వాడుతుండడం ఇటు రైతులతోపాటు మొత్తం మానవాళి మనుగడకు సవాలుగా మారింది. దిగుబడులు పెరిగినా, ఖర్చులు దుర్భరంగా మారి, ఉత్పత్తుల ధరలు పడిపోవడం ఒక వైపు, భూమి కలుషితమై మిత్రకీటకాలు నశిస్తూ, హానికరమైన పురుగులు , తెగుళ్ళు చెలరేగుతూ పంట ఎంతవరకు, ఎలా చేతికొస్తుందనే నమ్మకం కొరవడి రైతుల ఆత్మహత్యలకు దారితీస్తుండడం మరో విషాదం. ఇక వినియోగదారులది మరో రకమైన దుస్థితి. వారు తీసుకుంటున్న ఆహారం ఎంతవరకు సురక్షితమో వారికి తెలియదు. రకరకాల వ్యాధులు వదలకుండా పీడిస్తుంటే అందుకు ఏవేవో కారణాలను వెదుకుతారు కాని, అసలు కారణం వారు తీసుకునే ఆహారంలోనే వుందని వారికి తెలియదు. తెలిసినా మరో మార్గం లేదు. కాని, యిప్పుడిప్పుడే పరిస్థితిలో మార్పు వస్తున్నది. ఆరోగ్యకరమైన ఆహార పదార్ధాల వినియోగానికి ఆదరణ పెరుగుతున్నది. రైతులలో కూడా ఆలాంటి ఆరోగ్య సురక్షితమైన ఆహార పదార్ధాలను పండించాలనే ఆలోచన పెరుగుతుండడం సంతోషదాయకమైన విషయం. అయితే ఈ మార్పు ఇంకా చిరు దశలోనే వున్నది. మరెన్నో ముందడుగులు పడితే కాని కావలసిన ఆరోగ్యకర ఆహార భద్రత చేకూరదు. అప్పుడే పర్యావరణం సురక్షితమై ప్రాణికోటి మనుగడకు భద్రత చేకూరదు. ఇవన్నీ ఒకదానితో మరొకటి ముడిపడిన పరస్పరాశ్రిత పరిణామాలు, పర్యవసానాలు. ఇప్పుడు ఎఫ్ పి ఓలు వేదికగా రైతులు సంఘటితమవుతున్నారు కనుక ఒక మంచి ఆలోచన చేయడానికి, సామూహికంగా దానిని అమలుపరచడానికి ఎంతో అవకాశం వుంది. అంటే, తమ భవిష్యత్తు,తోపాటు మొత్తం సమాజ భవిష్యత్తుకు కూడా పూచీపడదగిన, పూచీపడవలసిన గురుతరమైన బాధ్యత రైతులపైన వున్నదన్నమాట! మొదటినుంచి మనం అనుకుంటున్నట్టు ఎఫ్ పి ఓలకు అవకాశాలు అనంతం! ఆలోచనలకు పదునుపెడితే వారే నవ సమాజ నిర్మాతలు! ఈ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తించే ఏపిమాస్ పర్యావరణ హిత వ్యవసాయం పై స్మరజిత్ రే స్మారక చర్చా గోష్ఠిని నిర్వహించింది. ఈ గురుతరమైన బాధ్యత నిర్వహణలో ఏపిమాస్ ఎప్పుడూ తన వంతు పాత్ర పోషిస్తూనే వుంటుంది. సమాజ భద్ర భవితవ్యానికి దోహదం చేస్తూనే వుంటుంది. సభ్య రైతులను ఈ దిశగా కార్యోన్ముఖులను చేయగలిగితే ఎఫ్ పి ఓలు తమ సామాజిక బాధ్యతను చాలా మేరకు నెరవేర్చినట్టే !


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**


ఆమోదయోగ్యం కాని అవకాశం కంటె ఇష్టమైన దాంట్లో వైఫల్యమే మేలు

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఎల్. భవాని, జి. దివ్యశ్రీ, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, ఎస్. ప్రహ్లాదయ్య

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి

## లోపలి పేజీలలో ....


| | |
|---|---|
| ➪ పర్యావరణ హిత వ్యవసాయానికి సవాళ్ళు | 05 |
| ➪ వృత్తి,సిఎంఎస్‌చే ఏపిమాస్ ఎఫ్‌పిఓల సందర్శన | 07 |
| ➪ నాగాలాండ్ బృందానికి ఏపిమాస్ శిక్షణ | 09 |
| ➪ నాబార్డ్‌చే తెలంగాణా ఫోకస్ పేపర్ విడుదల | 10 |
| ➪ 7రాష్ట్రాల సమాఖ్యలకు ఏపిమాస్ 'ఆదర్శ'శిక్షణ! | 12 |
| ➪ 'వాష్'కార్యక్రమాలపై ఎఫ్‌పిఓలకు అవగాహన | 14 |
| ➪ నకిలీ రుణాలతో మెప్మాకు టోపీ ! | 16 |
| ➪ 'మహిళలకు సహకరిద్దాం...ప్రగతికి పరుగులు | 18 |
| ➪ ఏటా ఒక సంకల్పం ... | 20 |
| ➪ నారీ శక్తి అంటారుగా... చేతల్లో చూపండి | 21 |
| ➪ తమలపాకుతో ఇన్ని ప్రయోజనాలున్నాయా.. | 22 |
| ➪ పెరుగుతున్న గర్భాశయ క్యాన్సర్ ముప్పు ! | 23 |
| ➪ బ్లడ్‌షుగర్‌ను అదుపులో వుంచే ఆహారం ! | 25 |
| ➪ చిరుధాన్యాల బియ్యం తయారుచేసే యంత్రం! | 26 |
| ➪ పురుగు మందులు : నిజానిజాలు ! | 27 |
| ➪ 5వేలతో వ్యాపారం లక్షల టర్నోవర్ | 28 |
| ➪ పూచీకత్తు లేకుండా రూ.10 లక్షల రుణం | 29 |
| ➪ మహిళల బ్యాంక్ ఖాతాలోకి రూ.3 లక్షలు! | 30 |
| ➪ మన దేశంలో దారుణంగా రైతుల పరిస్థితి ! | 31 |
| ➪ ఉచిత సౌర విద్యుత్ పథకానికి దరఖాస్తు ఇలా... | 32 |
| ➪ ఆంధ్రప్రదేశ్‌లో 46 లక్షల ఎకరాలు బీడు ! | 33 |
| ➪ రైతులకు నెలా రూ.3000 పెన్షన్ పథకం ! | 34 |


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'**మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

సముద్రం మీద వచ్చే అలల మాదిరి తేలిపోయే ఆలోచన కాకుండా సముద్రమంత లోతుగా ఆలోచించు

# పర్యావరణ హిత వ్యవసాయానికి సవాళ్ళు ఎన్నెన్నో !

– లిఖితా శ్రీరామ్



ఏపిమాస్ ఆవిర్భావంలో, తొలి నాళ్ళలో ఆ సంస్థ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన ఐ ఏ ఎస్ అధికారి శ్రీ స్మరజిత్ రే కు స్మారక నివాళిగా ఏపిమాస్ ప్రతి ఏటా స్మరజిత్ రే  స్మారక ఉపన్యాసం, చర్చాగోష్ఠి వంటి కార్యక్రమాన్ని గత 13 ఏళ్ళుగా నిర్వహిస్తూ వస్తున్నది. ఆ కోవలో 14 వ కార్యక్రమాన్ని 2024 ఫిబ్రవరి 27 వ తేదీన హైదరాబాద్‌లోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించింది. ఆహార, వాణిజ్య విధానాల ప్రముఖ విశ్లేషకుడు డాక్టర్ దేవీందర్ శర్మ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఇటు ప్రత్యక్షంగా, అటు డిజిటల్ విధానంలో పరోక్షంగా ప్రేక్షక శ్రోతలు పాల్గొనే 'హైబ్రిడ్ ' తరహాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు , సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి , శ్రీమతి నందితా రే, డాక్టర్ దేవీందర్ శర్మ వేదికను అలంకరించారు.

తొలుత శ్రీ స్మరజిత్ రే గురించి, ఆయనతో ఏపిమాస్‌కు వున్న అనుబంధం గురించి, స్మరజిత్ రే స్మారక కార్యక్రమాల నిర్వహణ విశేషాల గురించి  శ్రీ సి ఎస్ రెడ్డి క్లుప్తంగా వివరించారు.

అనంతరం డాక్టర్ దేవీందర్ శర్మ 'పర్యావరణ హిత వ్యవసాయం: భవిష్యత్ వ్యవసాయ ముఖచిత్రానికి వెలుగు దివ్వె ' అనే నిర్దిష్ట అంశం గురించి ప్రధాన ప్రసంగం చేస్తూ, గ్రామీణాభివృద్ధి రంగానికి, వ్యవసాయ జీవనోపాధులకు శ్రీ స్మరజిత్ రే చేసిన సేవలను కొనియాడారు. పర్యావరణ హిత వ్యవసాయ ప్రాముఖ్యాన్ని గురించి ఆయన వివరిస్తూ ....

- అధిక దిగుబడుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవడం, వ్యవసాయ కుటుంబాల  జీవనోపాధుల సమస్యలను పరిష్కరించడంలో స్వేచ్ఛా విపణుల వైఫల్యంతో గ్రామీణ , పట్టణ ఆర్థిక, సాంఘిక అంతరం మరింత పెరగడం ఒక బాధాకరమైన వాస్తవం
- మితిమీరిన  రసాయనికాల వినియోగంతో ప్రకృతి వనరులు క్షీణించడం, ఆహారపు గొలుసు విషపూరితం కావడం
- ప్రాధాన్య ప్రాతిపదిక పోషకాహార భద్రత నుంచి ప్రోటీన్ల అందుబాటుకు మారడం వినియోగదారుల ప్రాధాన్యాలను ప్రభావితంచేసింది

ఈ విషయమై జరిగిన చర్చ ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న అయోమయ స్థితిని ఎత్తి చూపింది.



అనుకూల వ్యవసాయ విధానాలు ఎంతైనా అవసరం. రైతులకు, పర్యావరణానికి మేలు చేకూరుస్తూ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయన్న హామీ అవసరం.

డాక్టర్ శర్మ తన ప్రసంగాన్ని ముగిస్తూ, పర్యావరణ హిత వ్యసాయ భవిష్యత్తు మొత్తంమీద ఆ వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించే వినియోగదారుల అభిరుచుల మీద, ప్రాధాన్యాల మీద ఆధారపడి వుంటుందని చెప్పారు. అందువల్ల దేశవ్యాప్తంగా ఆహార వినియోగదారులు సంఘటితమై తమకు సేంద్రియ ఆహార ఉత్పత్తులు మాత్రమే కావాలని ఒత్తిడి తేవాలని ఆయన సూచించారు. తద్వారా స్వేచ్ఛా వాణిజ్యం పుంజుకుంటుందని, పర్యావరణ హిత వ్యవసాయం సుస్థిరమవుతుందని ఆయన అన్నారు. ■

ఒక కీలక ప్రత్యామ్నాయంగా పర్యావరణ హిత వ్యవసాయం రసాయనిక ఆహారపదార్థాల కర్మాగారాలతో పోటీపడవలసి వుంటుంది. రసాయనిక వ్యవసాయం, కృత్రిమ ఆహార పదార్థాల ఉత్పత్తి పర్యవసానంగా ప్రపంచ వ్యాప్తంగా మితిమీరి వెలువడుతున్న జి హెచ్ జి వాయువుల పరిమాణాన్ని పర్యావరణ హిత వ్యవసాయం గణనీయంగా తగ్గించగలదని పేరు పొందింది. రసాయనిక వ్యవసాయం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా గ్రామీణ రైతుల జీవనోపాధులు దారుణంగా దెబ్బతిన్నాయి. ఇందుకు భిన్నంగా, సామాజిక యాజమాన్యంలోని పర్యావరణహిత ప్రకృతి వ్యవసాయ ప్రక్రియలు పర్యావరణం, భూసారం, నీటిమట్టాల పునర్వికాసానికి, దీర్ఘకాలిక సుస్థిరాభివృద్ధికి, తద్వారా రైతుల జీవనోపాధుల భద్రతకు, వినియోగదారుల ఆరోగ్యానికి, జీవన నాణ్యతకు పూచీపడతాయన్న దృఢాభిప్రాయం నెలకొన్నది.

అయితే, పర్యావరణ హిత వ్యవసాయం విస్తృత స్థాయిలో అమలు జరగాలంటే, రైతు



**తాము ఎలా వున్నా ఇతరులను ఉత్తములుగా తీర్చిదిద్దకపోతే వారు నాయకులే కాదు**

# వృత్తి, సి ఎం ఎస్ చే ఏపిమాస్ ఎఫ్ పి ఓల సందర్శన

– వినాయకరెడ్డి, గోపాలరాజు

**మ**న దేశంలోని 1000 ఎఫ్ పి ఓలను (రైతు ఉత్పత్తిదారుల సంస్థలను) పటిష్టమైన వ్యాపార సంస్థలుగా, సుస్థిరాభివృద్ధి సంస్థలుగా ఎదగడానికి ప్రభుత్వానికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడానికి ఏపిమాస్, వృత్తి, సిఎంఎస్ (కాటలిస్ట్ మానేజ్మెంట్ సర్వీసెస్) సంస్థలు అవి ఏర్పాటు చేసిన ఎఫ్ పి ఓల పరస్పర సందర్శన, అనుభవాల విశ్లేషణ సాగించాలని సంయుక్త ప్రణాళిక రూపొందించు కున్నాయి. ఇందులో భాగంగా వృత్తి సంస్థ కర్నూలు జిల్లా డోన్ మండలం జలదుర్గం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎఫ్ పి ఓను ఏపిమాస్ ఎం డి, సి ఇ ఓ శ్రీ సి యస్ రెడ్డి 2024 ఫిబ్రవరి 7వ తేదీన సందర్శించి, ఆ సంస్థ పాలకవర్గ సభ్యులతో చర్చించారు.

ఇదేవిధంగా, వృత్తి, సి ఎం ఎస్ సంస్థల నుండి



కొంతమంది ప్రతినిధులను ఏపిమాస్ ఆహ్వానించింది. ఏపిమాస్ ఆహ్వానం మేరకు వృత్తి, సి ఎం ఎస్ సంస్థల నుండి ఏడు మంది ప్రతినిధులు రెండు టీములుగా 2024 ఫిబ్రవరి 19–20 తేదీలలో శ్రీ సత్యసాయి జిల్లా , అన్నమయ్య జిల్లాలలోని ఏపిమాస్ ఎఫ్ పి ఓలను సందర్శించారు.

**ప్రతినిధుల వివరాలు :**

**వృత్తి నుంచి:** శ్రీమతి రాగిణి–సి ఇ ఓ , శ్రీనరసింహమూర్తి –ప్రాంతీయ సంధానకర్త, శ్రీమతి పూజ–సీనియర్ మేనేజర్, శ్రీ కిరణ్ – సీనియర్ కన్సల్టెంట్

**సిఎంఎస్ నుంచి:** శ్రీ రఘునాథన్ – డైరెక్టర్ , శ్రీమతి శిల్ప –సామర్థ్య పెంపుదల మేనేజర్ , శ్రీమతి శృతి–జీవనోపాధుల ప్రత్యేక నిపుణురాలు




మొదటి రోజు 19–02–2024న నల్లమాడ రైతు సంస్థ, నల్లమాడలో సిసిడి ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి రైతు సమాఖ్య, చెన్నేకొత్తపల్లి , రెడ్స్ సంస్థ ఏర్పాటు చేసిన మహిళా రైతు సంస్థ, కదిరిలో సందర్శించారు.

రెండవరోజు 20–02–2024న మదనపల్లి టమాట మార్కెట్‌లో వేలంపాట విధానం, గ్రేడింగ్, మార్కెటింగ్ గూర్చి తెలుసుకున్నారు. రెండు టీములుగా వాల్మీకిపురం, నిమ్మనపల్లి మండలంలోని రైతు సంస్థలను సందర్శించారు. సాయంత్రం ఏపీమాస్ ఏర్పాటు చేసిన రైతు సంస్థల సి. ఈ. ఓ. లతో చర్చించారు.

ఈ రెండు రోజులు వారు రైతు సంస్థల పాలకవర్గ సభ్యులతో రైతు సంస్థ ఏర్పాటు ఉద్దేశం. నిర్వహణ, చట్టపరమైన బాధ్యతలు, అభివృద్ధి దశలు, వ్యాపార వివరాలు,





విజన్, భవిష్యత్ ప్రణాళికలు, ఆర్థిక స్వావలంబన, బ్యాంకు ఫైనాన్స్, పాలకవర్గం , సిబ్బంది విధులు భాధ్యతల గూర్చి చర్చించారు. రైతు సంస్థలు ఏర్పాటు చేసిన ఇన్పుట్ బిజినెస్, కస్టమ్ హైరింగ్ సెంటర్, ప్రాసెసింగ్ సెంటర్‌లను సందర్శించారు.

**వృత్తి బృందం చేసిన సూచనలు**

1. ప్రతి రైతు సంస్థలో 1000 మంది పైగా వాటాదారులను చేర్పించాలి.
2. వ్యాపారం కొరకు సంస్థలో పెట్టుబడి (కార్పస్), నిధులు పెంచాలి.
3. రైతు సంస్థ సుస్థిర అభివృద్ధి కొరకు ప్రణాళిక చేయాలి
4. రైతు సంస్థల సుస్థిరానికి నిరంతరం శిక్షణలు ఇవ్వాలి
5. రైతు సంస్థ ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్లాట్ ఫాం ఏర్పాటు చేసుకోవాలి
6. వ్యాపార సంస్థలతో ఎఫ్ పి ఓల అనుసంధానం
7. కనీసం 75 శాతం సభ్యులకు ఎఫ్ పి ఓలు సేవలను అందించాలి
8. సాంకేతికను అందిపుచ్చుకోవాలి
9. సగం మంది సభ్యులు మహిళలు ఉండేటట్లు చూడాలి
10. బ్రాండ్, విలువ పెంపు, మార్కెటింగ్‌లపై శ్రద్ధ
11. మోడల్ ఎఫ్.పి.ఓ.లుగా ఉండాలి



## విడాకులు తీసుకున్నా తల్లి, తండ్రి హోదా చెరిగిపోదు

**భా**ర్యాభర్తలు విడాకులు తీసుకున్నప్పటికీ తల్లిదండ్రులుగా వారి హోదా చెరిగిపోదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. పాఠశాలల్లోని పిల్లల రికార్డుల్లో వారి పేర్లను కొనసాగించవ్చని తెలిపింది. మైనర్‌గా ఉన్న తన కుమారుని రికార్డుల్లో తండ్రి అన్న చోట తన పేరును కొనసాగించాలంటూ ఓ తండ్రి చేసిన వినతిని అంగీకరించింది. ఓ జంటకు 2006 మార్చిలో కుమారుడు జన్మించాడు, పాఠశాలల్లో తండ్రిగా అతని పేరునే నమోదు చేశారు. 2015లో భార్యాభర్తలు విడాకులు తీసుకున్నారు. ఆ తరువాత ఆమె మరో వివాహం చేసుకుంది. 2016 తరువాత తండ్రి అన్న కాలంలో రెండో భర్త పేరును రాయడం ప్రారంభించారు. తాను జీవించి ఉండగా మరొకరి పేరును తండ్రిగా రాయడమేమిటని ప్రశ్నిస్తూ ఆయన కోర్టును ఆశ్రయించారు. జన్మనిచ్చిన తండ్రిగా తన పేరునే రికార్డుల్లో రాయాలని, రెండు వారాల్లో ఆయన పేరుతో రికార్డులు మార్చాలంటూ సంబంధిత పాఠశాలను న్యాయమూర్తి ఆదేశించారు.

– ఏబీఎన్ సౌజన్యంతో

ప్రతీకారం తీర్చుకుంటే నీకు హాని చేసినవారితో నీవూ సమానమే , మన్నించగలిగితే వారికంటె నీవు ఎంతో అధికం

# నాగాలాండ్ బృందానికి ఏపిమాస్ శిక్షణ

– జి.శ్రీనివాస్

**నా**గాలాండ్ రాష్ట్రంలోని ఈలుతోరోస్ క్రిస్టియన్ సొసైటీ (ఇ సి యస్) అనే స్వచ్ఛంద సంస్థ సిబ్బందికి స్వయం సహాయ సమాఖ్యలపై శిక్షణ , క్షేత్ర సందర్శనను ఏపిమాస్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఏపిమాస్ శిక్షణ కేంద్రం 22-02-2024 నుండి 24-02-2024 తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించింది. ఈ శిక్షణకు ఆరు మంది అభ్యాసకులు హాజరైనారు. ఈ మూడు రోజుల కార్యక్రమంలో రెండు రోజులపాటు శిక్షణ , ఒకరోజు జనగాం జిల్లా లోని లింగాల ఘనపూర్ మండలంలో క్షేత్ర సందర్శన నిర్వహించారు.



శిక్షణ ప్రారంభం కార్యక్రమంలో శ్రీ సి.యస్. రెడ్డి, శ్రీమతి యస్.రామలక్ష్మి పాల్గొని ఏపిమాస్ గురించి, ఈ శిక్షణలో వారు ఏం నేర్చుకోవాలని అనుకుంటున్నారో ఆ విషయాలను వివరించారు. పాల్గొన్న అభ్యాసకులను వారి సంస్థ ఎటువంటి కార్యక్రమాలను చేస్తున్నదో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.

శ్రీమతి రామలక్ష్మి సమాఖ్య అంటే ఏమిటో, రాష్ట్ర, దేశస్థాయిలోని వివిధ రకాల సమాఖ్యల గురించి చర్చించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని సంఘాల, సమాఖ్యల ఏర్పాటు విధానాన్ని తెలియజేశారు. సమాఖ్యల సమావేశం నిర్వహణ, ఇతర పద్ధతులపై అవగాహన కల్పించారు. స్వయం నియంత్రణ ఉద్యమ కార్యక్రమాల అమలు తీరును వివరించారు.

శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఒకరోజు క్షేత్ర సందర్శన కోసం జనగాం జిల్లాలోని లింగాల ఘనపూర్ మండలంలోని సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య సభ్యులు, ప్రతినిధులతో నేరుగా మాట్లాడి సంఘాలు, సమాఖ్యల నిర్వహణ విధానంపై అవగాహన పొందారు. మండల సమాఖ్య సిబ్బందితో సమావేశమై ప్రాజెక్ట్ సంఘాలకు, సమాఖ్యలకు ఎలాంటి సేవలు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో మూడవ రోజు శ్రీ సి.యస్. రెడ్డి, శ్రీమతి రామలక్ష్మి, శ్రీ జి. శ్రీనివాస్ పాల్గొని అభ్యాసకులు క్షేత్ర సందర్శనలో నేర్చుకున్న విషయాలపై చర్చించి వారి సందేహాల నివృత్తి చేశారు. ఏపిమాస్ ప్రతినిధి బృందం వచ్చే నెలలో నాగాలాండ్‌లోని వారి సంస్థను సందర్శించి అక్కడి యితర సంస్థలను, కార్యక్రమాలను అధ్యయనం చేసి ఏపిమాస్, ఈ.సి.యస్ సంయుక్తంగా వారి సంస్థల బలోపేతానికి ఒక వ్యూహం తయారు చేయాలని నిర్ణయించారు.

ఈ విధంగా మూడు రోజుల పాటు శిక్షణ పొందిన అభ్యాసకులు మాట్లాడుతూ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా వున్నదని, శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్‌లకు, శిక్షణ ఏర్పాటు చేసిన ఏపిమాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ■



# నాబార్డ్‌చే తెలంగాణా రాష్ట్ర ఫోకస్ పేపర్ విడుదల

**నా**బార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం తాను చేపట్టే వివిధ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా 2024 జనవరి నెలలో అనేక గ్రామీణ మహిళాభ్యుదయ కార్యక్రమాలను స్వయంగా నిర్వహించింది, వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నది. ఆ వివరాలను చూద్దాం.




జనవరి 30 వ తేదీన నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం 'రాష్ట్ర రుణ సదస్సు'ను నిర్వహించింది. ఇందులో భాగంగా 2024-25 సంవత్సరానికి రాష్ట్ర ఫోకస్ పేపర్‌ను నాబార్డ్ రూపొందించింది. ఈ పేపర్‌ను తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. రాష్ట్ర వార్షిక రుణ ప్రణాళికను రూపొందించడంలో ఈ ఫోకస్ పేపర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆ పత్రాన్ని రూపొందిం చిన నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయాన్ని మంత్రి కొనియాడారు.



వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడంలో, పాడి కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనలో, గ్రామీణ గోదాముల నిర్మాణంలో నాబార్డ్ తోడ్పాటు మరింతగా అవసరమని శ్రీ తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు.

రుణ సదస్సులో భాగంగా నాబార్డ్ నిర్వహించిన సర్వ భాగస్వామ్య చర్చావేదికలో నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతలతో పాటు జాతీయ మాంసం పరిశోధనా సంస్థ (ఎన్ ఆర్ సి ఎం) డైరెక్టర్ , క్రిడా డైరెక్టర్, అపెడా రీజియనల్ డైరెక్టర్, ఏ ఐ ఎఫ్ పి ఎం యు ప్రభృతులు తమ ఆలోచనలను పంచుకున్నారు. ఇంకా వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపి, తెలంగాణా ఆర్ సి ఎస్ శ్రీమతి హరిత, టి ఎస్ డి డి సి ఎఫ్ ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి చిట్టెంలక్ష్మి, టి ఎస్ ఐ ఐ ఎండి శ్రీ ఇ విష్ణువర్ధనరెడ్డి , ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యదర్శులు, సీనియర్ అధికారులు, ఆర్ ఆర్ బి ల ఛైర్మన్లు, టి ఎస్ కాబ్ ఎండి, బ్యాంకుల సీనియర్ అధికారులు, ఐకార్ పరిశోధనా సంస్థల, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. ఒక ఎఫ్ పి ఓ సంచార గ్రామీణ దుకాణాన్ని మంత్రి జండా ఊపి ప్రారంభించారు.

నాబార్డ్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించే ప్రదర్శనను కూడా ఈ సందర్భంగా నిర్వహించారు.

**చిరుధాన్యాల విలువ పెంపు**

నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సిజిఎం శ్రీమతి సుశీల చింతల వరంగల్లు, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాలలో 2024 జనవరి 18 వ తేదీన పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మహబూబాబాద్ జిల్లా పెద్దవడుగూరు గ్రామంలో 90 మంది ఎస్ హెచ్ జి మహిళల జీవనోపాధుల పెంపుదల, నైపుణ్యాభివృద్ధి కోసం ఎల్ ఇ డి పి పథకం కింద మంజూరుచేసిన చిరుధాన్యాల విలువపెంపు




కార్యక్రమాన్ని సందర్శించారు. ఆ పథకం లబ్ధిదారులు ఆ పథకం కింద తమకు మంజూరైన సోలార్ డ్రయ్యర్ , బ్లెండర్–రోస్టర్, ప్యాకింగ్ యంత్రాలతో తాము తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. శిక్షణ పొందిన ఈ ఎస్ హెచ్ జి మహిళలు ఇటీవల ముగిసిన '10 వ దక్కన్ హాట్ ' లో అత్యధిక విక్రయాలతో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు.

పెద్దవడుగూరు క్లస్టర్‌ను బలోపేతం చేయాలన్న సంకల్పంతో మరి మూడు గ్రామాలను ఆ క్లస్టర్‌కు జోడించి, ఈ గ్రామాలకు ఒక ఎల్ ఇ డి పి కార్యక్రమాన్ని మంజూరు



చేసి, మంజూరు పత్రాన్ని నిర్వాహక సంస్థ ఎస్ ఎల్ ఎస్ ఓ కు సి జి ఎం అందజేశారు.

ఈ పర్యటనలోనే సి జి ఎం ఐనవోలు ఎఫ్ పి సి ఎల్ గ్రామీణ దుకాణానికి (రూరల్ మార్ట్) కూరగాయల మార్కెటింగ్ కోసం రవాణా వాహనం కొనుగోలుకు నిధుల మంజూరు పత్రాన్ని అందజేశారు. ఇంతేకాకుండా, సహాయ సోషల్ సర్వీస్ సొసైటికి 120 మంది ఎస్ హెచ్ జి సభ్యులకు జీవనోపాధి పెంపుదల కోసం సోలార్ డ్రయ్యర్ కొనుగోలుకు ఎల్ ఇ డి పి మంజూరు పత్రాన్ని కూడా సి జి ఎం అందజేశారు.

హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని తెలంగాణా గ్రామీణ బ్యాంక్ 12 మంది ఎస్ హెచ్ జి సభ్యులకు ఎల్ ఇ డి పి పథకం కింద మంజూరుచేసిన రుణ పత్రాలను కూడా లబ్ధిదారులకు సి జి ఎం అందజేశారు.

**ధీశాలి మహిళా ఎఫ్ పి సి ఎల్ కార్యక్రమం**

2024 జనవరి 10 వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లాలో ధీశాలి మహిళా ఎఫ్ పి సి ఎల్ నాబార్డ్ ఆర్థిక సహాయంతో, హైదరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ ప్రసాద్ తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పి జె టి ఎస్ ఏ యు) తోడ్పాటుతో నిర్వహించిన 'ఉత్తమ వ్యవసాయ పద్ధతులతో ఎఫ్ పి ఓల బలోపేతం' కార్యక్రమం ముగింపు సమావేశంలో సి జి ఎం శ్రీమతి సుశీల చింతల పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె త్వరితంగా భూసారాన్ని పరీక్షించే 'కృషి రాస్తా' అనే యంత్రాన్ని ధీశాలి ఎఫ్ పి సి ఎల్ కు అందజేశారు. వ్యవసాయంపై పి జె టి ఎస్ ఏ యు రూపొందించిన చిరు పుస్తకాన్ని కూడా ఆమె వారికి అందజేశారు.

అనంతరం ఎల్ ఇ డి పి ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్వహిస్తున్న సేంద్రియ కూరగాయల సాగు కార్యక్రమానికి మంజూరుచేసిన సోలార్ డ్రయ్యర్‌ను ఆమె ప్రారంభించారు. ఆ తర్వాత ఆమె ధీశాలి మహిళా ఎఫ్ పి సి ఎల్ కు చెందిన ఒక క్రియాశీల రైతు మహిళ నిర్వహిస్తున్న ప్రదర్శన క్షేత్రాన్ని సందర్శించారు. ■



# ఏడు రాష్ట్రాల సమాఖ్యలకు ఏపిమాస్ 'ఆదర్శ' శిక్షణ!

– జి. శ్రీనివాస్

ఏడు రాష్ట్రాల నుండి ఏడు స్వచ్ఛంద సంస్థలకు చెందిన స్వయంసహాయ సమాఖ్యల ప్రతినిధులకు ఆదర్శ సమాఖ్యల తీరుతెన్నులపై 13–02–2024 నుండి 17–02–2024 తేదీ వరకు ఐదు రోజుల పాటు జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఏపిమాస్ నిర్వహించింది. హైదరాబాదు లోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయ శిక్షణ కేంద్రంలో డి.జి.ఆర్.వి



ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ శిక్షణలో 25 మంది అభ్యాసకులకు పాల్గొన్నారు. ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో నాలుగు రోజులపాటు శిక్షణ, ఒకరోజు జనగాం జిల్లాలో క్షేత్ర సందర్శన ఏర్పాటు చేయటం జరిగింది.

శిక్షణ ప్రారంభం కార్యక్రమంలో ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి యస్.రామలక్ష్మి పాల్గొని భారతదేశంలోని మహిళా సంఘాల, సమాఖ్యల స్థితిగతులను గురించి, జాతీయస్థాయిలో సమాఖ్యల విజన్ 2030 గురించి వివరించారు. సమాఖ్యల విజన్ 2030లో సమాఖ్యలను ఏర్పాటు చేస్తున్న సంస్థల పాత్ర ఏవిధంగా ఉండాలో చర్చించారు.

శ్రీమతి రామలక్ష్మి గారు సమాఖ్య స్వరూప, స్వభావాలను, రాష్ట్ర స్థాయి, దేశస్థాయిలోని వివిధ రకాల సమాఖ్యలను గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో సంఘాల, సమాఖ్యల ఏర్పాటు విధానాన్ని తెలియజేశారు. సమాఖ్యల సమావేశ నిర్వహణ, యితర పద్ధతులపై అవగాహన కల్పించారు. సంఘాలు, సమాఖ్యలు పాటించాల్సిన సహకార సూత్రాలు, పద్ధతులు, సహకార విలువల గురించి వివరించారు. సమాఖ్యల బలోపేతం కోసం ఈ మార్గదర్శకాలను ఎలా అమలుపర్చాలో వివరించారు.

శ్రీ మురళి జాజున ఏపిమాస్ నిర్వహిస్తున్న కార్య క్రమాల గురించి వివరించారు. అభ్యాసకులు వారి అనుభవాలను పంచుకునే అవకాశం కల్పించారు. వారి సంస్థలలో సంఘాల, సమాఖ్యలకోసం వారు చేస్తున్న కార్యక్రమాలను చెప్పించారు.

ఒకరోజు జరిగిన కార్యక్రమ అంశాలను పునశ్చరణ చేయటంతోపాటు, సమాఖ్యలలో పాలకవర్గం, పదాధి కారులు, మహాసభ మొదలైన వివిధ విభాగాల బాధ్యతలపై అవగాహన కల్పించారు.

ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి.యస్ రెడ్డి ఆదర్శ సమాఖ్యల గురించి, ఆదర్శ సమాఖ్య కోసం ఏవిధంగా పని చేయాలో వివరంగా తెలిపారు. శ్రీమతి యల్.భవాని పరిశుభ్రత, ఆరోగ్యం , పోషకాహారానికి సంబంధించిన వాష్ కార్యక్రమాల అమలు గురించి తెలియజేశారు. శ్రీ నరేంద్ర ఖండే స్వయం నియంత్రణ ఉద్యమం అమలు తీరును, కార్యక్రమాలను వివరించారు.



ఆశాభావాన్ని మించిన కానుక లేదు , అనుభవ పాఠాలు నేర్పుతూ పరాజయం నుంచి విజయానికి చేర్చే నిచ్చెన అది




శ్రీ మహేశ్ అలగప్ప , శ్రీ శ్రీనివాస్ నాయకత్వ బాధ్యతల గురించి, ఎన్నిక లు నిర్వహించే విధానం గురించి తెలియజేశారు. శ్రీ బి.వి.యస్ రెడ్డి శ్రీనిధి కో–ఆపరేటివ్ బ్యాంకు అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించారు.

శిక్షణ కార్యక్రమంలో భాగంగా అభ్యాసకులు ఒకరోజు క్షేత్ర సందర్శన కోసం జనగాం జిల్లా లింగాల ఘనపూర్ మండలంలోని సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య సభ్యులు, యితర ప్రతినిధులతో సమావేశమై సంఘాలు, సమాఖ్యల నిర్వహణ విధానంపై నేరుగా మాట్లాడి అవగాహన పొందారు. జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్, వారి సిబ్బందిని కలుసుకుని వారి ద్వారా మరికొన్ని అంశాలపై అవగాహన పొందారు. అభ్యాసకులు క్షేత్ర సందర్శనలో నేర్చుకున్న విషయాలపై ఏపిమాస్ బృందం చర్చించి, వారి సందేహాలను నివృత్తి చేసింది.

శ్రీ వేద్ ప్రకాష్ ఎఫ్ పి ఓల (రైతు ఉత్పత్తిదారు సంస్థల) జీవనోపాధి కార్యక్రమాలు, విధి విధానాలు, సంఘాలలో అమలు గురించి తెలియపరిచారు.

ఈ విధంగా ఐదు రోజుల పాటు శిక్షణ పొందిన అభ్యాసకులు మాట్లాడుతూ, శిక్షణ చాలా చక్కగా జరిగిందంటూ, శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్‌లకు, శిక్షణ ఏర్పాటు చేసిన ఏపిమాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చివరగా శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికేట్‌లు అందజేయడంతో ఐదురోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ■

## స్వయం సంపాదన లేని భార్య పేరిట కొన్న ఆస్తి కుటుంబ ఆస్తే

**గృ**హిణి ( హోమ్ మేకర్ ), స్వతంత్రంగా ఆదాయ వనరులు లేని భార్య పేరు మీద భర్త కొనుగోలు చేసిన ఆస్తిని కుటుంబ ఆస్తిగానే పరిగణించాలని అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. మరణించిన తన తండ్రి ఆస్తికి తనకే చెందుతుందని తీర్పు ఇవ్వాలంటూ ఓ వ్యక్తి వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. సాధారణంగా కుటుంబానికి పెద్ద అయిన భర్త పేరు మీదే ఆస్తిని కొనుగోలు చేస్తారని.. భార్య పేరు మీద కొనుగోలు చేసినంత మాత్రానా అది ఆమె సొంత ఆస్తి కాదని తెలిపింది. భార్య తన సంపాదనను ఉపయోగించి ఆస్తిని కొనుగోలు చేసినట్లు రుజువు చేసుకోవాలని, లేకపోతే అది కుటుంబ ఆస్తిగానే భావించారని వివరించింది.

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్ చెందిన సౌరభ్ గుప్తా అలహాబాద్ న్యాయస్థానంలో సివిల్ దావాను దాఖలు చేశారు. తన తండ్రి కొనుగోలు చేసిన ఆస్తిలో నాల్గో వంతుకు తాను సహ–భాగస్వామ్యుడిని పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఆ ఆస్తిని చనిపోయిన తన తండ్రి కొనుగోలు చేసినందున అతను తన తల్లితో పాటు సహ–భాగస్వామినని కోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. తనకు స్వతంత్ర ఆదాయ వనరులు లేనందున ఆ ఆస్తిని తన భర్త తనకు కానుకగా ఇచ్చాడని తల్లి తెలిపింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన అలహాబాద్ హైకోర్టు ఇలాంటి ఆస్తి ఉమ్మడి కుటుంబం మొత్తానికి అవుతుందని స్పష్టం చేసింది. ■

ఆచరణ తగ్గి ఆకాంక్ష పెరిగితే అది తీరని ఆందోళన ; ఆకాంక్షను మించి ఆచరణ ముందడుగేస్తే అది విజయం

# 'వాష్' కార్యక్రమాలపై ఎఫ్ పి ఓలకు అవగాహన

– ఎస్. ప్రహల్లాద, వాసు, గోపాలరాజు

ఏపిమాస్ సంస్థ ' వాటర్ ఆర్గ్ ' ఆర్థిక సహాయంతో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణా రాష్ట్రాలలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) తోడ్పాటుతో 'వాష్ ' పేరుతో నీరు,ఆరోగ్యం, పరిశుభ్రతపై మహిళా స్వయంసహాయ సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నది. ఇప్పటివరకు ఈ కార్యక్రమం ద్వారా లక్ష కుటుంబాలకు లబ్ధి చేకూరింది.



## ఎఫ్ పి ఓలకు వాష్ కార్యక్రమాలు

ఏపిమాస్ చిన్న, సన్నకారు రైతులకు తోడ్పాటు అందించాలన్న సంకల్పంతో రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్ పి ఓలను) ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 26 ఎఫ్ పి ఓలను ఏర్పాటు చేసింది. దాదాపు 17 వేల రైతు కుటుంబాలు వీటిలో సభ్యులుగా వున్నాయి. ఇప్పటి వరకు మహిళా సంఘాలకు వాష్ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ వచ్చిన ఏపిమాస్ ఈ ఎఫ్ పి ఓలకు కూడా ఆ కార్యక్రమాలను విస్తరించాలని సంకల్పించింది. అందుకనుగుణంగా, ఎఫ్ పి ఓల పాలకవర్గ సభ్యులకు, రైతులకు వాష్ కార్యక్రమాలపై అవగాహన కలిపించుటకు 2024 జనవరి, ఫిబ్రవరి నెలలలో 30 శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది.

చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, సోమల, చౌడేపల్లి, వి.కోట, గుడిపాల మండలాలలో 7 అవగాహనా కార్యక్రమాలను నిర్వహించగా, మొత్తము 248 మంది పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లాలోని పి.టి.ఎం, తంబళ్ళపల్లి, పెద్దమండ్యం, కురబలకోట, మదనపల్లి, నిమ్మనపల్లి, రామసముద్రం, గుర్రంకొండ, పీలేరు, కలకడ, కలికిరి మండలాలలో16 అవగాహనా కార్యక్రమాలను నిర్వహించగా, మొత్తము 601 మంది హాజరయ్యారు.

ఇంతే కాకుండా అనంతపురం జిల్లాలో సెట్టూర్, పమిడి, పెద్దవడుగూరు, పెద్ద పప్పూరు, యాడికి మండలాలలో 196 మందికి 5 శిక్షణలు, సత్యసాయి జిల్లాలో నల్లమడ, గుడిబండ మండలాలలో 95 మందికి 2 అవగాహనా కార్యక్రమాలను నిర్వహించగా, 4 జిల్లాలలో కలసి మొత్తం 1,140 మంది నీరు, ఆరోగ్యం మరియు పారిశుద్ధ్య కార్యక్రమాలపై అవగాహన పొందారు.

ఇందులో, 4 జిల్లాలలోని వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ,కార్యవర్గ సభ్యులు, మండల మహిళా సమాఖ్యలకు చెందిన కార్యవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు జనవరి 22వ తేదీన ప్రారంభమై ఫిబ్రవరి 24వ తేదీన ముగిశాయి.

ఈ శిక్షణా కార్యక్రమాలకు ఏపిమాస్ ఆంధ్రప్రదేశ్ సంచాలకులు శ్రీ వినాయకరెడ్డి మార్గదర్శకం వహించారు. ఏపిమాస్ ప్రాజెక్టు మేనేజర్లు డా.ఎస్. ప్రహల్లాద, శ్రీ అమరేంద్రుడు, శ్రీరమేష్‌రెడ్డి, శ్రీఅబ్దుల్లా ఖాదర్, డా.వాసుదేవరెడ్డి, డా.భార్గవి, గోపాలరాజు, బి.డి.ఓ మధుసూదన్ రెడ్డి నిర్వహించారు. వాష్ ప్రాంతీయ




సమన్వయకర్త శ్రీమతి రోజ్‌మేరి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో సెర్ప్ ఎ.పి.ఎంలు, ఎఫ్.పి.ఓలు, సి.ఇ.ఓలు, ఇతర సిబ్బంది హాజరై కార్యక్రమాల విజయవంతానికి తోడ్పాటు అందించారు. శిక్షణలలో వాష్ కార్యక్రమాలతో పాటు, ఆ కార్యక్రమాలకు రుణాలను పొందే విధానాలను కూడా తెలియజేయడం జరిగింది. శిక్షణల చివరిలో ఏపిమాస్ వాష్‌పై ముద్రించిన కరపత్రాలను పంపిణి చేశారు.

**శిక్షణ కార్యక్రమాల ఫలితాలు**

శిక్షణ ముగింపులో శిక్షకులు వాష్ కార్యక్రమాలపై పొందిన అవగాహన గురించి అడిగినపుడు 50 శాతం మంది తాము మరుగుదొడ్లు, రక్షిత మంచినీరు వాడుతున్నట్లు తెలియజేయడం శుభపరిణామంగా చెప్పవచ్చు. మరికొంత మంది రక్షిత మంచినీరు ఏర్పాటు కొరకు సహాయపడాలని, ఇంకొంతమంది టాయిలెట్ నిర్మాణం కొరకు సహకరించాలని కోరడం వాష్ కార్యక్రమాలు చెప్పుకోదగిన రీతిలో ప్రజలకు చేరువ అవుతున్నాయని చెప్పడానికి నిదర్శనం.

**వాష్ పథకం ద్వారా చేపట్టిన కార్యక్రమాలు**

♦ స్వయం సహాయక సంఘ సభ్యులకు వాష్ కార్యక్రమాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించుట

♦ రక్షిత మంచి నీటి సదుపాయం లేని కుటుంబాలకు ఆ వసతి ఏర్పాటుకు తోడ్పడుట

♦ మరుగుదొడ్లు లేని కుటుంబాలకు వాటిని సమకూర్చుకోవడానికి సహాయపడుట

♦ వర్షపునీటిని వడిసిపట్టి సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజలను చైతన్యపరచుట

♦ ప్రత్యేక అవసరాలున్న వ్యక్తులను గుర్తించి వారికి మరుగు దొడ్ల సదుపాయం కల్పించుటకు సహాయపడుట

♦ పారిశుధ్యం ప్రాముఖ్యతను తెలియజెప్పి, ఎల్లవేళలా పారిశుధ్యాన్ని పాటించే విధంగా ప్రజలను చైతన్యపరచుట.

గ్రామీణ స్థాయిలో ఈ వాష్ కార్యక్రమాన్ని గడప గడపకు తీసుకొనిపోయే కార్యకర్తలను గుర్తించి వారికి వివిధ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో స్వయంసహాయ సంఘాల సభ్యులు, స్వయం సహాయ సంఘాల గ్రామస్థాయి కార్యకర్తలు, సంఘాలసిబ్బంది మొదలగు వారికి వివిధ దశలలో శిక్షణలు యివ్వడం జరిగింది. ■






పాత స్నేహం బంగారం, కొత్త స్నేహం వజ్రం; కాని పాత స్నేహితులను మరువరాదు, వజ్రమైనా బంగారంలోనే పొదగాలి

# నకిలీ రుణాలతో మెప్మాకు టోపీ !

**మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఏర్పాటు చేసిన మెప్మా ఇప్పుడు అవినీతిపరులకు ఆదాయ వనరుగా మారింది. కొందరు ఆర్పీలు, రాజకీయ నాయకులు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కై అక్రమాలకు తెరతీశారు. పొదుపు మహిళల పేరుతో రూ.కోట్లు మెక్కేశారు. లేని పొదుపు సంఘాలను ఉన్నట్లుగా చిత్రీకరించి మాయ చేశారు. ఆధార్ కార్డులను మార్చేశారు. ఆన్‌లైన్‌లో గ్రూపులు కనిపించకుండా మాయ చేశారు. మొత్తంగా బోగస్ రుణాలతో భారీగా దోచేశారు.**

• • • • • • •

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో బోగస్ రుణాల బాగోతం వెలుగులోకి వచ్చింది. కొందరు రాజకీయ నాయకురాళ్ళ ప్రోద్బలంతో పేర్లు మార్చి నకిలీ గ్రూపులతో ఆ సంస్థలోని ఆర్పీలు పెద్ద దందానే నడిపారు. వాస్తవానికి ఒక గ్రూపులో పది మంది సభ్యులు ఉంటారు. ఒక్కో ఆర్పీ కింద కొన్ని గ్రూపులు నడుస్తుంటాయి. ఒక్కో గ్రూపు నుంచి ఇద్దరు మహిళా సభ్యుల పేర్లు తీసి, వారి ఆధార్ కార్డులు మార్చేసి, గ్రూపు పేరును పూర్తిగా మార్చకుండా ముందు శ్రీ అనే పదాన్ని చేర్చి మరో గ్రూపుగా చూపెట్టారు.

ఎప్పటి నుంచో బ్యాంకర్లతో రుణాలకు సంబంధించి పరిచయాలు కలిగిన ఆర్పీలు కొత్త గ్రూపులుగా వారికి పరిచయం చేశారు. దీంతో వారికి లక్షల్లో రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇదంతా గ్రూపు సభ్యులకు తెలియదు. ఇలా వందల సంఖ్యలో నకిలీ పొదుపు గ్రూపులను తయారుచేసి బ్యాంకర్లను బురిడీ కొట్టించి ఒంగోలు నగరంలోనే సుమారు రూ. 50 కోట్ల అవినీతికి పాల్పడినట్లు సమాచారం.

**మూడు జిల్లాల నాయకురాలి నిర్వాకం..!**

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పొదుపు సంఘాలకు సంబంధించి మూడు జిల్లాల నాయకురాలిగా చెప్పుకునే ఓ మహిళా నేత 'బదుగు'ల పేరుతో భారీగా దోచుకున్నట్లు సమాచారం. ఆమె ఒంగోలులోని అలహాబాద్ బ్యాంకులో రుణాలు తీసుకోవడమే కాకుండా మెప్మాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. ఓ మహిళా కార్పొరేటర్ భర్త కూడా ఆర్పీల సహకారంతో కొన్ని నకిలీ పొదుపు గ్రూపులను తయారు చేసి రుణాలు పొందారు. దీన్ని ఆ ప్రాంతానికి చెందిన కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో) గుర్తించినట్లు సమాచారం. ఇలాంటి అవినీతి వ్యవహారాలు చేస్తే తన ఉద్యోగం పోతుందని ఆమె అడ్డం తిరగడంతో సదరు మహిళా కార్పొరేటర్ భర్త తిరిగి చెల్లించినట్లు తెలుస్తోంది.

అదేవిధంగా మెప్మాకు సంబంధం లేని ఓ మహిళ తాను రాజకీయ పలుకుబడి కలిగిన మనిషినని చెప్పుకుంటూ బ్యాంకర్లను దారికి తెచ్చుకుని బోగస్ గ్రూపుల పేరుతో రుణాలు పొందినట్లు తెలిసింది. కొన్ని గ్రూపుల వద్ద వసూళ్లకు కూడా పాల్పడుతున్నట్లు తెలిసింది. ఈమెపై మెప్మా పీడీ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఇదేతరహాలో మరో మహిళా నేత రూ.కోట్లు దండుకున్నట్లు సమాచారం.

**బయటపడింది ఇలా..**

బోగస్ రుణాలు తీసుకున్న కొన్ని గ్రూపులు సకాలంలో రుణాలు తిరిగి చెల్లించకపోవడంతో మూడు నెలల క్రితం బ్యాంకు అధికారులు రంగంలోకి దిగారు. సభ్యులను నెల వాయిదాలు చెల్లించాలని కోరడంతో అసలు తాము రుణాలే తీసుకోలేదని వాపోయారు. దీంతో ఆర్పీల మోసం బయటకు వచ్చింది. ఆతర్వాత ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. నగరంలోని పలువురు ఆర్పీలు ఈ తరహా మోసానికి పాల్పడి పొదుపు పేరుతో రుణాలు దండుకున్నట్లు తేలింది. అయితే ఈ వ్యవహారంలో మెప్మా అధికారులు మౌనందాల్చగా, కొందరు బ్యాంకర్లు సైతం అన్నీ తెలిసి కూడా కిమ్మనకుండా

ఉన్నట్లు సమాచారం. అందిన సమాచారం మేరకు యాభైకి పైగా నకిలీ సంఘాల ద్వారా రుణాల పేరుతో దోపిడీ జరిగినట్లు సమాచారం.

**నకిలీ గ్రూపుల పేరుతో రుణాలు నిజమే : మేయర్**

ఒంగోలు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో నకిలీ గ్రూపుల పేరుతో రుణాల కుంభకోణం వాస్తమేనని ప్రాథమికంగా గుర్తించినట్లు మేయర్ శ్రీమతి గంగాడ సుజాత తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. పత్రికలో రాసిన విధంగా రూ.50కోట్ల మేర గోల్మాల్ జరగలేదని, ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు అది రూ.12కోట్ల వరకూ ఉండొచ్చని చెప్పారు. అది కూడా పొదుపు రుణాలు కాకుండా మరో పేరుతో గ్రూపుల ద్వారా తీసుకునే అవకాశం ఉందన్నారు. 2022లో రుణాలు తీసుకున్న కొందరు ఆర్పీలు తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకర్లు దీనిపై మెప్మా అధికారులకు సమాచారం కూడా ఇచ్చారన్నారు.

**విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం**

మెప్మాలో రుణ కుంభకోణం ఆరోపణలపై విచారణ జరుపుతున్నాం. వాస్తవమని తేలితే ఎంతటివారిపైన అయినా తగిన చర్యలు తీసుకుంటాం.పట్టణ పొదుపు మహిళల ఆర్థిక పురోభివృద్ధి కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ప్రోత్సహిస్తోంది. దీనిని ఆసరా చేసుకుని కొందరు అవినీతికి పాల్పడినట్లు పత్రికలలో రావడం బాధాకరం.

సీఎంఎం, సీవోలు, సీఎల్ఆర్పీలు, ఆర్పీలు ఇలా ఏస్థాయిలో అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదు. అక్రమాలు రుజువైతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అన్ని బ్యాంకులకు లేఖలు రాశాం. వివరాలు సేకరిస్తున్నాం. విచారణను వేగవంతం చేసి తగు చర్యలు తీసుకుంటాం. సిబ్బంది, ఆర్పీలు, బ్యాంకర్లతో వేర్వేరుగా సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు, పూర్తిస్థాయిలో విచారణచేసి తగిన చర్యలు తీసుకుంటాం.

– టి. రవికుమార్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్

■

## మెప్మాలో ఇద్దరు సీఓలు, ఐదుగురు ఆర్పీలు ఉద్యోగాల నుంచి తొలగింపు

### పలువురికి మెమోలు జారీ

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో బోగస్ గ్రూపులు సృష్టించి భారీగా రుణ దోపిడీకి పాల్పడిన పలువురు అధికారులపై వేటుపడింది. ఇద్దరు సీఓలు, ఐదుగురు ఆర్పీలను ఉద్యోగం నుంచి తొలగిస్తూ మెప్మా మిషన్ ఎండీ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. మరికొందరికి చార్జిమెమోలు ఇచ్చారు.

పట్టణ పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పలు రుణాలు అందించగా.. కొందరు ఆర్పీలు, సీఓలు రాజకీయ నేతలతో కలిసి నకిలీ గ్రూపులను సృష్టించి భారీగా దోచుకున్న వైనంపై స్పందించిన కలెక్టర్ దినేష్ కుమార్ విచారణకు ఆదేశించారు. ఆర్పీలు, సీవోలు, ఇతర సిబ్బందిని డీఆర్డీఏ పీడీ, సివిల్ సప్లయిస్ అధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్లు గతవారం విచారించారు. దీంతోపాటుగా పలు బ్యాంకుల్లో విచారణచేసి ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఇదేసమయంలో పీడీ కూడా నివేదికను మెప్మా ఎండీకి పంపారు. దీనిపై ఆమె సీరియస్ అయ్యారు.

ఈ వ్యవహారంలో భాగస్వాములని విచారణలో తేలిన ఇద్దరు సీఓలు చాంద్‌బీ, నిర్మల,ఆర్పీలు ఏవీ.సుజాత, సలోమి, పి.సుజాత, ఝాన్సీరాణి, వాసవిలను ఉద్యోగం నుంచి తొలగించారు. సీఎంఎం కు, ఐదుగురు సిఓలకు మెమోలు జారీ చేశారు. ఇదిలా ఉండగా పీడీ టి.రవికుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇప్పటివరకూ ప్రాథమిక విచారణలో పలువురిను గుర్తించి విధుల నుంచి తొలగించగా, కొందరికి మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. విచారణ ఇంకా కొనసాగుతుందని, అయితే ఇప్పటికే అవినీతికి పాల్పడిన కొందరు ఆర్పీలు బోగస్ గ్రూపుల పేరుతో పొందిన రుణాలను తిరిగి చెల్లిస్తున్నారని తెలిపారు. త్వరలోనే పూర్తి నివేదికను కలెక్టర్ దినేష్‌కుమార్, మెప్మా ఎండీ విజయలక్ష్మికి అందజేస్తామని తెలిపారు.

■

# 'మహిళలకు సహకరిద్దాం... ప్రగతిని పరుగులు పెట్టిద్దాం'




**మ**హిళా దినోత్సవం మళ్ళీ వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా నవ చైతన్యం జ్వలిస్తున్నది. మహిళా సంపూర్ణ సాధికారత దిశగా అంతర్జాతీయ స్థాయిలో నిరంతరాయంగా సాగుతున్న ప్రస్థానం, ప్రతి ఏటా మార్చి 8 వ తేదీతో మరో కొత్తదనం సంతరించుకుని, మరో కొత్త మైలురాయిని చేరుకుని, నవ్యభావనలతో, ఉద్యమ స్ఫూర్తితో, చేరుకోవలసిన గమ్యానికి మరింత చేరువయ్యే మార్గాన్ని నిర్దేశించుకుని, మరింత దృఢమైన ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తుంటుంది.

ప్రపంచ దేశాల సంఘటిత వేదిక అయిన 'ఐక్యరాజ్య సమితి' ప్రతి ఏటా మహిళా దినోత్సవానికి సరికొత్త మార్గ దర్శనం చేస్తూ, ఏడాది పొడవునా చేపట్టవలసిన కార్యక్రమ ప్రణాళికను ప్రకటించడం ఆనవాయితీ. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఐక్యరాజ్య సమితి 2024 సంవత్సరానికి మహిళా దినోత్సవ మహదాశయాన్ని ప్రకటించింది.

'ఆమె మన సహభాగస్వామి ! మహిళలకు సహకరిద్దాం , ప్రగతిని పరుగులు పెట్టిద్దాం ! ' (కౌంట్ హర్ ఇన్ : ఇన్‌వెస్ట్ ఇన్ విమెన్. యాక్సిలరేట్ ప్రోగ్రెస్) అనే నినాదమే ఆ మహత్తర సంకల్పం! ప్రపంచ వ్యాప్తంగా మహిళల స్థితిపై ఐక్యరాజ్య సమితి 68 వ కమిషన్ ప్రకటించిన ఈ కార్యాచరణ ప్రణాళిక మహిళలకు, బాలికలకు అంతటా మరింత మెరుగైన ఆర్థిక సహభాస్వామ్య మార్గాలను అన్వేషిస్తుంది.

**సహభాగస్వామ్య స్ఫూర్తిని రగిలించండి**

ఐక్యరాజ్య సమితి బాటలోనే ' ఇంటర్నేషనల్ విమెన్స్ డే (ఐ డబ్ల్యు డి) అనే సంస్థ కూడా ప్రతి ఏటా మహిళా దినోత్సవ నినాదాన్ని ప్రకటిస్తుంటుంది. 2024వ సంవత్సరానికి ఐ డబ్ల్యు డి నినాదం 'సహభాగస్వామ్య స్ఫూర్తిని రగిలించండి' (ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజన్) అనేది. మహిళా సహభాగస్వామ్యాన్ని అవగాహన చేసుకుని, ఆ భావనకు విలువనిచ్చే విధంగా మనం యితరులలో స్ఫూర్తిని రగిలించగలిగితే, మెరుగైన ప్రపంచాన్ని మనం పొందగలుగు తామని తన మహిళా దినోత్సవ నినాదానికి ఐ డబ్ల్యు డి భాష్యం చెప్పింది.

ఇక తాము సహభాగస్వాములము కావాలన్న స్ఫూర్తి మహిళలలో రగిలితే యిది తమకోసమేననే భావన, దానిని తమకు అన్వయించుకోవడం, సాధికారత ఒకదానివెంట ఒకటి వస్తాయి. మనందరం కలసికట్టుగా మహిళలకోసం మరింత

సహభాగస్వామ్య ప్రపంచాన్ని రూపొందిద్దామని ఐ డబ్ల్యు డి పిలుపునిచ్చింది.

**స్త్రీ వాదులు అవసరం**

ఇక , 'ఇంటర్నేషనల్ విమెన్స్ డెవలప్‌మెంట్ ఏజన్సీ' (ఐ డబ్ల్యు డి ఏ) అనే మరో సంస్థ 'ప్రపంచానికి స్త్రీ వాదులు అవసరం' ( ది వర్ల్డ్ నీడ్స్ ఫెమినిస్ట్స్) అనే నినాదాన్ని 2024 మహిళా దినోత్సవ సందేశంగా ప్రకటించింది.

లైంగిక సమానత్వాన్ని సాధించడంకోసమంటూ ప్రకటిస్తున్న సంకేతాలు, చిహ్నాల వంటి సాంకేతిక ప్రక్రియల వల్ల ఒరిగిందేమీ లేదని, అవి లక్ష్యసాధనలో శక్తిహీనంగా తయారయ్యాయని ఐ డబ్ల్యు డి ఏ భావిస్తున్నది. ఇందుకు ఉదాహరణగా ఊదా రంగు కప్ కేకులను అది పేర్కొన్నది.

**మహిళా దినోత్సవం మొదలైన తీరు...**

ప్రపంచ స్థాయిలో మహిళా ఉద్యమాలకు 110 సంవత్సరాలకు పైగా చరిత్ర వున్నది. 1909 ఫిబ్రవరి 28 వ తేదీన ఉత్తర అమెరికాలో మహిళలకు ఓటు హక్కు కోసం పిడికిలి బిగించిన మహిళా ప్రతిఘటన కాలక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి దారి తీసిన తొలి అడుగు. అయితే అది కేవలం ఉత్తర అమెరికాకే పరిమితమైంది. అనంతరం 1911 మార్చి 19న ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జెర్లాండ్ దేశాలు ఉద్యోగినులు, శ్రామిక మహిళల సమ్మె, నిరసనలతో హోరెత్తిపోయాయి.

మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై ఆ రోజున జర్మనీకి చెందిన సోషలిస్ట్ నాయకురాలు క్లారా జెట్కిన్, రష్యా విప్లవోద్యమ, మహిళా ఉద్యమ ప్రముఖురాలు అలెగ్జాండర్ కొలంతయ్ నేతృత్వంలో జర్మనీ, ఆస్ట్రియా, డెన్మార్క్, స్విట్జెర్లాండ్, ఇతర ఐరోపా దేశాల సోషలిస్ట్ మహిళలు పెద్ద సంఖ్యలో సమ్మెలు, పాద యాత్రలు జరిపారు. అప్పటినుంచి ప్రతి ఏటా మార్చి 19న మహిళా దినోత్సవాన్ని పాటిస్తూ వచ్చారు.

క్రమంగా ఉద్యోగినుల సమస్యలే కాకుండా శాంతియుత సహజీవనం, మహిళల హక్కులు కూడా ఈ ఉద్యమంలో భాగమైనాయి. 1915లో మొదటి ప్రపంచ యుద్ధాన్ని నిలిపివేయాలంటూ జెట్కిన్ స్విట్జర్లాండ్‌లోని బెర్న్ నగరంలో ఒక ప్రదర్శన నిర్వహించారు. యుద్ధానికి సంబంధించిన ఉభయ శిబిరాల మహిళలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

అనేక దేశాలలో ఒకే రోజున ఉద్యమించిన మహిళల చైతన్య శక్తికి, సంఘటిత కార్యాచరణకు సంకేతంగా 1911 మార్చి 19వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా గణుతికెక్కింది. 1975 నుంచి ఐక్యరాజ్య సమితి ఈ మహిళా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నది.

**గద్దె దిగిన చక్రవర్తి**

ఇక ఇప్పటి అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి తొలి మెట్టుగా అత్యంత ప్రసిద్ధమైనది 1917 మార్చి 8న రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ఆహారం, శాంతి కోసం రష్యన్ మహిళలు జరిపిన మహా ప్రదర్శన! జెట్కిన్, కొలంతాయ్ లు ఇరువురూ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఈ సమ్మె ఆ నగర మంతటా ఐదురోజులపాటు అల్లర్లకు, దాడులకు దారితీసింది. ఈ అల్లర్ల పర్యవసానంగా రష్యా చక్రవర్తి జార్ నికొలస్-2 పదవి నుంచి వైదొలగాడు.

ఈ విధంగా నాటి మహిళా మహోద్యమం ఒక చక్రవర్తిని పదవీచ్యుతుని చేసి, 'ఫిబ్రవరి విప్లవం' గా చరిత్రలో నిలిచిపోయింది. (1917 వరకు రష్యా జూలియన్ క్యాలెండర్‌ను అనుసరించేది. ఆ క్యాలెండర్ ప్రకారం ఆ ఉద్యమం జరిగింది ఫిబ్రవరి 24-28 తేదీలలో. అందుకే అది ఫిబ్రవరి విప్లవమని పేరు పొందింది.

1918 నుంచి రష్యాలో ప్రస్తుతం అనుసరిస్తున్న గ్రిగేరియన్ క్యాలెండర్ వాడుకలోకి వచ్చింది. గ్రిగేరియన్ క్యాలెండర్ ప్రకారం ఆ ఉద్యమ తేదీలు మార్చి 8-12 అవుతాయి.

ఆ తర్వాత లెనిన్ నాయకత్వంలో రష్యాలో ఏర్పడిన తొలి సోవియెట్ ప్రభుత్వంలో కొలంతాయ్ మంత్రి అయ్యారు. ఆమె పట్టుపట్టి 'మహిళల మహా పోరాటానికి గుర్తు' గా మార్చి 8వ తేదీని అధికార సెలవుదినంగా ప్రకటింపజేశారు ■

# మహిళా దినోత్సవం ... ప్రతి ఏటా ఒక స్ఫూర్తి సుధ !

ఐక్యరాజ్య సమితి 1975వ సంవత్సరం నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నప్పటికి 1996 నుంచి ఏడాదికొక కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తున్నది. లక్ష్యసాధన దిశగా ఏడాదికి ఒక నినాదాన్ని, కార్యాచరణ పథాన్ని సమితి నిర్దే శిస్తున్నది. ఆ కార్యాచరణ ప్రణాళికామాలికను చూద్దాం!

1996 : గతాన్ని గౌరవిస్తూ, భవిష్యత్తుకు ప్రణాళిక

1997 : మహిళలు... శాంతి చర్చలు

1998 : మహిళలు... మానవ హక్కులు

1999 : మహిళలపట్ల హింసకు తావులేని ప్రపంచం

2000 : శాంతికోసం మహిళలు ఏకంకావడం

2001 : మహిళలు శాంతి, ఘర్షణలపై మహిళల అజమాయిషీ

2002 : నేటి ఆఫ్ఘన్ మహిళ ... వాస్తవాలు, అవకాశాలు

2003: లైంగిక సమానత్వం ... సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు

2004 : మహిళలు ... హెచ్ ఐ వి, ఎయిడ్స్

2005 : 2005 సంవత్సరం తర్వాత లైంగిక సమానత్వం, భద్రత కలిగిన భవిష్యత్‌ను రూపొందించడం

2006 : మహిళలు ... నిర్ణయాత్మక పాత్ర

2007 : మహిళలపై హింసకు పాల్పడే వారిని శిక్షించక పోవడాన్ని తుదముట్టించాలి

2008 : పెట్టుబడి వనరుగా మహిళలు, బాలికలు

2009 : స్త్రీ, పురుషులు కలసికట్టుగా మహిళలపైన, బాలికలపైన హింసను అరికట్టడం

2010 : సమాన హక్కులు, సమానావకాశాలు, అందరి ప్రగతి

2011 : విద్య, శిక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాలలో సమానమైన అవకాశాలు ; మహిళలకు గౌరవప్రదమైన ఉపాధి కల్పనకు మార్గనిర్దేశం

2012 : గ్రామీణ మహిళా సాధికారత ... పేదరికానికి, ఆకలికి తావులేకుండా చేయడం

2013 : వాగ్దానం వాగ్దానమే ... ఇది మహిళలపై హింసను తుదముట్టించే కార్యాచరణకు సమయం

2014 : మహిళలకు సమానత్వం అందరికీ ప్రగతి

2015 : మహిళా సాధికారతే మానవాళి సాధికారత, సాధిద్దాం

2016 : 2030నాటికి భూగోళం చెరిసగం(50–50): లైంగిక సమానత్వ సాధనకోసం ఆ దిశగా మరింత కృషి

2017 : మారుతున్న పని ప్రపంచంలో మహిళ: 2030 నాటికి భూగోళం చెరిసగం (50–50)'

2018 : ఇదే సమయం: గ్రామీణ, పట్టణ క్రియాశీల కార్యకర్తలు మహిళల జీవితాలలో మార్పు తెస్తున్నారు

2019 : 'సమానంగా ఆలోచించు, చురుకుగా నిర్మించు, మార్పు కోసం వినూత్న మార్గాన్ని అనుసరించు'.

2020 : మహిళలు హక్కులను సాధించే సమానత్వ తరం!

2021 : కోవిడ్ 19 ప్రపంచంలో సమాన భవిష్యత్తును సాధిస్తున్న మహిళా నాయకత్వం

2022 : రేపటి సుస్థిరాభివృద్ధికోసం నేడు స్త్రీ పురుష సమానత్వం పాటిద్దాం

2023 : 'అందరికీ డిజిటల్ పరిజ్ఞానం: లైంగిక సమానత్వం కోసం నవీకరణలు, సాంకేతికత'

2024 :'ఆమె మన సహభాగస్వామి! మహిళలకు సహకరిద్దాం, ప్రగతిని పరుగులు పెట్టిద్దాం !

■

## ప్రపంచ మహిళా మహాసభలు !

- ➪ మొదటి ప్రపంచ మహిళా మహాసభ: 1975 (మెక్సికో)
- ➪ రెండవ ప్రపంచ మహిళా మహాసభ : 1980 (కోపెన్ హాగన్)
- ➪ మూడవప్రపంచ మహిళామహాసభ:1985 (నైరోబి)
- ➪ నాల్గవ ప్రపంచ మహిళామహాసభ:1995 (బీజింగ్) (నిజానికి కొన్ని అంతర్గత వైరుధ్యాల కారణంగా నాల్గవ ప్రపంచ మహిళామహాసభ పూర్తిగా సాగలేదు. ఐదవ మహాసభ అసలు చోటు చేసుకోలేదు.

సత్యం బాధాకరమైన చికిత్స , కాని అస్పష్టత పోతుంది, అసత్యం తక్షణ ఉపశమన ఔషధం, కాని దుష్ఫలితాలు ఎన్నో !

# 'నారీ శక్తి' అంటారుగా... చేతల్లో చూపండి : సుప్రీంకోర్టు

మహిళలు సున్నితమైన వాళ్ళు అంటూ కొన్ని రంగాలకే పరిమితం చేయొద్దని గొంతెత్తినా, ప్రయోజనం లేకుండా పోతున్నది. మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా చేయగలరని పదేపదే నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. ఎంతగా నిరూపించుకున్నా లైంగిక సమానత్వం పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఏదో ఒక పేరుతో వెనక్కిలాగేయడమే. ఆఖరుకు ప్రభుత్వాలు కూడా 'నారీ శక్తి' అని మాటలు చెప్పడమే గానీ పదోన్నతుల విషయంలో నిబద్ధతను చూపించడంలేదు. ఇందుకు ఉదాహరణే కోస్ట్ గార్డ్ (తీర సంరక్షక దళం) లో మహిళలకు శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయడానికి అనుమతించని కేసు. ఈ విషయమై సర్వోన్నత న్యాయస్థానం కేంద్రానికి అక్షింతలు వేసింది. ఆ కేసు వివరాలను చూద్దాం.

కోస్ట్ గార్డ్ లో అర్హులైన షార్ట్ సర్వీస్ కమిషన్డ్ (ఎస్ఎస్సీ) అధికారిణులతో శాశ్వత స్థాయి కమిషన్ ఏర్పాటు చేయడానికి అనుమతి లభించకపోవడంతో ప్రియాంక త్యాగి అనే అధికారిణి కోస్ట్ గార్డ్‌లో మహిళా అధికారులకు శాశ్వత కమిషన్‌ను నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై ఇటీవల ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి. పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.

'మహిళా సాధికారికత గురించి పదే పదే మాట్లాడే మీరు దాన్ని ఆచరణలో చూపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం నిలదీసింది.

అసలు కోస్ట్ గార్డ్‌లో మహిళలకు శాశ్వత కమిషన్‌పై "పితృస్వామ్య" విధానాన్ని ఎందుకు అవలంబిస్తున్నారంటూ కేంద్రానికి అక్షింతలు వేసింది. "మాట్లాడితే 'నారీ శక్తి'.. 'నారీ శక్తి' అంటారు. ఇప్పుడు ఇక్కడ ఎందుకు ఆచరణలో చూపించడం లేదు. ఈ విషయంలో నిబద్ధతను ప్రదర్శించాల్సిన తరుణం ఆసన్నమైంది. ఆర్మీ, నేవీలో ఈ విధానం సాధ్యమయ్యినప్పుడు కోస్ట్ గార్డ్‌లో ఎందుకీ వివక్ష?. అసలు కోస్ట్ గార్డ్ పట్ల ఎందుకంత ఉదాసీన వైఖరి... ఈ విషయంలో మీరు చాలా అగాథంలో ఉన్నారు.. మహిళలను సముచితంగా పరిగణించే విధానాన్ని మీరు రూపొందించాల్సిందే" అని కేంద్రాన్ని ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది .

మహిళలు కోస్ట్ గార్డ్‌లో ఉండలేరని చెప్పే రోజులు పోయాయని, వాళ్లు సరిహద్దులను రక్షించగలిగినప్పుడు తీరాలను రక్షించగలరని సుప్రీం కోర్టు పేర్కొంది. కేంద్రం తరపున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ విక్రమ్ జీత్ బెనర్జీ సదరు అధికారిణి త్యాగి ఆర్మీ, నేవీ కాకుండా తీరరక్షక దళంలో వేరొక డొమైన్లో పని చేస్తున్నందున ఇది వర్తించదని వాదన వినిపించడంతో జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఇలా వ్యాఖ్యానించింది. అలాగే అధికారిణులకు 10% శాశ్వత కమిషన్ మంజూరు చేయవచ్చన్న విక్రమ్ జిత్ బెనర్జీ వాదనపై కూడా ధర్మాసనం మండిపడింది.

అసలు మహిళలకు 10 శాతమే ఎందుకు?.. అంటే వారేమైనా తక్కువా? అని ధర్మాసనం నిలదీసింది. నేవీలో మహిళలకు శాశ్వత కమిషన్ ఉన్నప్పుడు కోస్ట్ గార్డ్‌లో అలా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించింది. మహిళలను సముచితంగా పరిగణించే విధానాన్ని రూపొందించాల్సిందే అని కేంద్రానికి స్పష్టం చేసింది.

త్రివిధ దళాల్లో మహిళలకు శాశ్వత కమిషన్ల ఏర్పాటుపై సర్వోన్నత న్యాయస్థానం తీర్పులిచ్చినా ఇంకా కాలదోషం పట్టిన ఆలోచనలతోనే ఉన్నారా? అని కేంద్రాన్ని ప్రశ్నిం చింది. ఈ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానం సమానత్వ భావనకు విరుద్ధమని, లైంగిక సమానత్వాన్ని దెబ్బ తీస్తుందని పేర్కొంది. అందువల్ల స్త్రీ పురుష సమానత్వంతో కూడిన విధానాన్ని రూపొందించాలని కేంద్రాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ■

# తమలపాకుతో ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయా..?

**భా**రతీయులు తమలపాకుకు ప్రత్యేకమైన అనుబంధం ఉంటుంది. అన్ని పంక్షన్లలోనూ దీని ప్రాముఖ్యత ఉంటుంది. ఈ తమలపాకును తరచుగా పూజలు, వివాహ వేడుకలు వంటి శుభకార్యాలలో ఉపయోగిస్తారు. ఈ ఆకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. ఔషధ తయారీలలో ఉపయోగించబడుతుంది. తమలపాకు బెనిఫిట్స్ ఇప్పుడు తెలుసుకుందాం...

గ్రామాల్లో రాత్రి భోజనం చేసిన తర్వాత తమలపాకులో వక్క వేసి నములతారు. ఇది ఎప్పట్నుంచో వస్తున్న ఆనవాయితీ. ఇలా చేయడం వల్ల జీర్ణక్రియ చక్కగా జరుగుతుంది. అలానే నోటి దుర్వాసన కూడా ఉండదు.

ఇక ఇటీవలి రోజుల్లో వివిధ రకాల పాన్‌లు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. అయితే పాన్‌లు, కిల్లీల కోసం ఉపయోగించే.. తమలపాకు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ తమలపాకులో అనేక వ్యాధులను దూరం చేసే శక్తి ఉంది.



- తమలపాకులతో పాటు తులసి ఆకులు, లవంగాలు, పచ్చకర్పూరం కలిపి రోజుకు రెండు పూటలా తీసుకుంటే కఫం, దగ్గు సమస్య దూరమవుతుంది.
- చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఉన్నవారు తమలపాకులను కొబ్బరినూనెలో కలిపి మెత్తగా నూరి తలకు పట్టిస్తే ఈ సమస్యలన్నీ తొలగిపోతాయి.
- తమలపాకులను వెల్లుల్లిపాయలు, చిన్న అల్లం ముక్క తేనె కలిపి నమలడం వల్ల సిరల్లో రక్తప్రసరణ బాగా జరుగుతుంది.
- తమలపాకుకు కొద్దిగా పసుపు రాసి పిల్లల తలకు పట్టిస్తే జలుబు సమస్య తగ్గుతుంది.
- గర్భిణీ స్త్రీలు తల్లిపాలు పెరగడానికి తమలపాకులు తీసుకోవడం మంచిది.
- చిన్న చిన్న గాయాల నుంచి రక్తస్రావం అవుతుంటే తమలపాకులను మెత్తగా రుబ్బి గాయంపై రాస్తే రక్తస్రావం ఆగుతుంది.
- తమలపాకును ఉప్పుతో నమిలి ఆ రసాన్ని మింగితే కడుపునొప్పి తగ్గుతుంది.
- తమలపాకును నమలడం వల్ల లాలాజల రసం పెరిగి జీర్ణశక్తి మెరుగుపడుతుంది.
- భోజనం చేసిన తర్వాత ఆకులను తింటే.. నోటి దుర్వాసన దూరమై మౌత్ హెల్త్ బాగుంటుంది.
- మొటిమల వల్ల ముఖం నిండా అల్లుకు పోతే.. తమలపాకును మెత్తగా నూరి మొటిమల మీద రాస్తే ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు పోతాయి.
- తమలపాకులను గ్రైండ్ చేసి కొబ్బరినూనెలో వేడిచేసి నొప్పి ఉన్న చోట రాస్తే పెయిన్ తగ్గుతుంది.
- తమలపాకులను రోజూ తింటే చిగుళ్లలో రక్తస్రావం ఆగుతుంది.
- బరువు తగ్గాలనుకునే వారు తమలపాకు కషాయాలను తయారు చేసి విరివిగా తీసుకుంటే జీర్ణశక్తి మెరుగుపడి బరువు తగ్గుతారు.
- తమలపాకు రసంతో పాటు నిమ్మరసం కలిపి రాసుకుంటే దురద సమస్య తగ్గుతుంది.
- తలనొప్పిగా ఉంటే కర్పూరం, కొబ్బరినూనెలో తమలపాకుల రసాన్ని కలిపి నుదుటిపై రాసుకుంటే నయమవుతుంది.

■

నమ్మితే మౌనం కూడా చక్కగా అర్థమవుతుంది, నమ్మకం లేకుంటే ప్రతి మాట అపార్థంగానే వినిపిస్తుంది

# నానాటికీ పెరుగుతున్న గర్భాశయ క్యాన్సర్ ముప్పు !

గర్భాశయ క్యాన్సర్ హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ద్వారా సోకుతుంది. ఇది లైంగిక సంపర్కం ద్వారా సంక్రమించే ఒక సాధారణ వైరస్. సాధారణంగా ఇది శరీరంలోకి ప్రవేశించాక క్యాన్సర్‌గా అభివృద్ధి చెందడానికి 15–20 ఏళ్లు పడుతుంది.


రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే మహిళల్లో 5–10 ఏళ్లకే క్యాన్సర్ కణాలు అభివృద్ధి చెందుతాయి. ఎక్కువమందితో లైంగిక చర్యల్లో పాల్గొనడం, గర్భనిరోధక మాత్రలు ఎక్కువగా వినియోగించడం వల్ల కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది.

**లక్షణాలేమిటి..?**

- గర్భాశయ క్యాన్సర్ వచ్చిన వారికి నెలసరి సమయంలో అధిక రక్తస్రావం అవుతుంది.
- పొత్తి కడుపులో నొప్పి.. తరచూ కడుపు ఉబ్బరం పదే పదే మూత్ర విసర్జనకు వెళ్తారు. ఆ సమయంలో మంట, నొప్పిగా అనిపిస్తుంది.
- శృంగారంలో పాల్గొన్నప్పుడు, ఆ తర్వాత యోని దగ్గర నొప్పి, మంటగా ఉంటుంది.
- మెనోపాజ్ తర్వాత శృంగారంలో పాల్గొన్నప్పుడు సంభోగం తర్వాత రక్తస్రావం అవుతుంది.
- దుర్వాసనతో కూడిన వైట్ డిశ్చార్జ్ అవుతుంది.
- అలసట, నీరసం, బరువు తగ్గడం, రక్తహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**'పాప్ స్మియర్ టెస్ట్'తో గుర్తించవచ్చు**

గర్భాశయ క్యాన్సర్‌ను గుర్తించడానికి వైద్యులు 'పాప్‌స్మియర్ టెస్ట్' నిర్వహిస్తారు. ఒక పరికరం సహాయంతో గర్భాశయ ముఖద్వారం నుంచి కొన్ని కణాలను సేకరించి వాటిని పరీక్షించడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను గుర్తిస్తారు. పెల్విక్ ఎగ్జామినేషన్, బయాప్సీ విధానాల ద్వారానూ దీన్ని గుర్తించవచ్చు.




**ముందు జాగ్రత్త చర్యలతో కట్టడి...**

మహిళలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు వ్యాక్సిన్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 9 నుంచి 26 ఏళ్ల మధ్య వయసున్న అమ్మాయిలకు ఈ వైరస్ సోకకుండా వ్యాక్సిన్ వేస్తారు. అలాగే.. పాప్ స్మియర్ పరీక్ష ద్వారా ముందుగానే దీన్ని గుర్తించి ప్రీ క్యాన్సర్ దశలోనే చిన్నపాటి చికిత్సతో నిర్మూలించవచ్చని వైద్యులు చెబుతున్నారు. 29–45 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు ప్రతి రెండు–మూడేళ్లకోసారి, 50–60 ఏళ్లవారు ఐదేళ్లకో సారి స్క్రీనింగ్ చేయించుకుంటూ ఉండాలని అంటున్నారు. అలాగే అసురక్షిత లైంగిక చర్యల్లో పాల్గొనకూడదని, తరచూ గర్భనిరోధక మాత్రలు మింగకూడదని సూచిస్తున్నారు.

**వ్యాక్సిన్లపై చర్చలు....**

గర్భాశయ క్యాన్సర్ నివారణకు సీరం ఇనిస్టిట్యూట్ స్వదేశీయంగా 'సర్వావ్యాక్' అనే వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ప్రయివేటు మార్కెట్‌లో ఇది రూ.2 వేలకు అందుబాటులో ఉంది. ఎంఎస్‌డీ ఫార్మా కంపెనీ కూడా గార్డాసిల్ 4 అనే వ్యాక్సిన్‌ను విక్రయిస్తోంది. ఇది ఒక్కో డోసు రూ. 3,927కి లభిస్తుంది. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీలతో చర్చలు జరుపుతోంది.

నీ సామర్థ్యాన్ని అనుమానిస్తే బాధపడవద్దు, ఎందుకంటె బంగారం నాణ్యతను శంకిస్తారు కాని ఇనుమును కాదుగా

**కిశోర బాలికలకు సెప్టెంబరులో వ్యాక్సినేషన్**

గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. 9–14 ఏళ్ల బాలికలు దీని బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సినేషన్‌ను ప్రోత్సహిస్తామని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. దీనికోసం సీరం సంస్థ ఆరు కోట్ల డోసులు కేంద్రానికి అందించనుందని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అవి అందగానే సెప్టెంబరులో వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా 9 నుంచి 14 ఏళ్ల వయసున్న బాలికలకు రెండు డోసులు టీకా ఉచితంగా యివ్వాలని భావిస్తున్నారు. ఫార్మా కంపెనీలతో కేంద్రం చర్చలు ఫలించి ఈ వ్యాక్సిన్ విరివిగా అందుబాటులోకి వస్తే ఒక్కో డోసు ధర రూ.200 నుంచి రూ.250 వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

**శరీరంలో మార్పులను గమనిస్తుండాలి**

మన దేశంలో పట్టణ ప్రాంత మహిళల్లో రొమ్ము క్యాన్సర్, గ్రామీణ ప్రాంతాల్లో గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉంటున్నాయని హైదరాబాద్ గచ్చిబౌలి లోని కేర్ క్యాన్సర్ సెంటర్ సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ గీతనాగశ్రీ నీరుకొండ తెలియజేశారు. సర్వైకల్ క్యాన్సర్ కేసుల్ని పాప్‌స్మియర్ టెస్టు ద్వారా ముందే గుర్తించే అవకాశం వున్నదని, తద్వారా మరణాలను కూడా గణ నీయంగా తగ్గించవచ్చునని ఆమె అన్నారు.

2020తో పోల్చితే 2025 నాటికి మన దగ్గర క్యాన్సర్ కేసులు 12.8 శాతం మేరకు పెరిగే ప్రమాదం ఉందని, ఈ ముప్పును తప్పించుకోవాలంటే.. మహిళలకు తమ శరీరంపై అవగాహన ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఏమాత్రం మార్పు కనిపించినా దాన్ని గుర్తించాలని, శరీరంలో నొప్పిలేని గడ్డలు ఏమి కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా తక్షణం వైద్యుణ్ణి సంప్రదించాలని ఆమె సూచించారు. జీవనశైలి మార్చుకోవాలని, మద్యపానం, ధూమపానం అలవాట్లు వుంటే వాటిని మానుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని, నిత్యం వ్యాయామం చేయాలని కూడా ఆమె సూచించారు. ■


## ఫారమ్ - IV

### 'మహిళా సాధికారత'

### తెలుగు మాస పత్రిక యాజమాన్యం, ఇతర అంశాల ప్రకటన

1. ప్రచురణ కేంద్రం : హైదరాబాద్
2. ప్రచురణ కాల వ్యవధి: నెల (మాస పత్రిక)
3. ముద్రణకర్త పేరు : టి.చంద్రశేఖర్ రెడ్డి
   జాతీయత : భారతీయత
   చిరునామా : ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు - 500089
4. ప్రచురణకర్త పేరు : టి.చంద్రశేఖర్ రెడ్డి
   జాతీయత : భారతీయత
   చిరునామా : ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు - 500089
5. సంపాదకుని పేరు : టి.చంద్రశేఖర్ రెడ్డి
   జాతీయత : భారతీయత
   చిరునామా : ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు - 500089
6. పత్రిక యాజమాన్యంలో భాగస్వాములైన లేదా మొత్తం వాటా ధనంలో ఒక శాతానికి మించి వాటాదారులైన వ్యక్తుల పేర్లు, చిరునామాలు: ---లేరు---

టి.చంద్రశేఖర్ రెడ్డి అనే నేను పైన పేర్కొన్న అంశాలన్నీ నాకు తెలిసినంతవరకు వాస్తవమని నమ్ముతూ, ఇందు మూలముగా ప్రకటిస్తున్నాను.

తేదీ:01-03-2024 ప్రచురణకర్త సంతకం

# బ్లడ్ షుగర్‌ను అదుపులో వుంచే ఆహార పదార్థాలు !

**మ**ధుమేహం లేదా చక్కెర వ్యాధి (డయాబెటిస్ ) యిప్పుడు దాదాపు సర్వజన సాధారణ అస్వస్థతగా మారి పోయింది. అయితే, ఈ వ్యాధిని నివారించడం సంగతి అలా వుంచినా, దానిని అదుపుచేసే అంకుశం మాత్రం, మనకు నిత్యం అందుబాటులోనే, ఆహారపదార్థాల రూపంలో మన వంట యింటిలోనే వుంది ! ఆ ఆహార పదార్థాలేమిటో తెలుసుకుందామా ...

**కాకరకాయ**

డయాబెటిస్ పేషెంట్లు తప్పకుండా తినాల్సిన వాటిలో కాకరకాయ ముందుంటుంది. దీనిలోని విటమిన్ ఎ, సి, యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయి అలాగే రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచుతాయి.

**దాల్చినచెక్క**

దాల్చినచెక్కలోని సమ్మేళనాలు రక్తంలో షుగర్ లెవెల్స్ తగ్గించడంలో సహాయపడతాయి. అందువల్ల టైప్–2 డయాబెటిస్‌తో బాధపడేవారు డైట్లో ఈ దాల్చినచెక్క చేర్చుకోవడం మంచిది.

**తృణధాన్యాలు**

ఓట్స్, క్వినోవా, బ్రౌన్ రైస్ వంటి తృణధాన్యాల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అలాగే వీటిలోని తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచుతుంది.

**మునగాకు**

మునగాకుల్లో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిలోని యాంటీ ఇంఫ్లమేటరీ గుణాలు రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచుతాయి. ఈ ఆకుల్ని సలాడ్స్, సూప్స్‌తో కలిపి తీసుకోవచ్చు.

**పండ్లు**

డయాబెటిస్ పేషెంట్లు తాజా పండ్లు తినడం చాలా మంచిది. యాపిల్స్, బేరి, బెర్రీస్, నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో షుగర్ లెవెల్స్ పెరగకుండా కాపాడుతుంది.

**ఆకుకూరలు**

పాలకూర, తోటకూర, బచ్చలికూర, మెంతి కూరలో కేలరీలు, కార్బోహైడ్రేట్స్ తక్కువగా ఉంటాయి. అందువల్ల టైప్–2 డయాబెటిస్ పేషెంట్లకు ఇది ఎంతో మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ పెరగకుండా కాపాడుతుంది.

**లెగ్యూమ్స్**

చిక్కుడు జాతికి చెందినవి, పప్పుదినుసుల్లో ఫైబర్, ప్రొటీన్స్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తంలో షుగర్ పెరగకుండా కాపాడతాయి.

**ఉసిరి**

ఉసిరి పండ్లలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రక్తంలో షుగర్ లెవెల్స్ పెరగకుండా కాపాడతాయి. అలాగే రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

**పసుపు**

పసుపులో కర్కుమిన్ అనే సమ్మేళనం యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉంటుంది. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి రక్తంలో షుగర్‌లెవెల్స్ అదుపులో ఉంచుతుంది. అందువల్ల డయాబెటిస్ పేషెంట్లు పసుపును ఆహారాల్లో కలపడం లేదా పసుపు పాలు తాగడం చాలా మంచిది.

**బాదం పప్పు**

బాదం పప్పు రెగ్యులర్‌గా మీ డైట్‌లో చేర్చుకొని తిన్నట్లయితే మీ రక్తంలో షుగర్ నిల్వలు పెరగవు. అంతేకాదు మీ శరీరం అనేక వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

**శనగలు**


శనగలను రెగ్యులర్‌గా మీ డైట్‌లో చేర్చుకొని తిన్నట్లయితే మీ రక్తంలో షుగర్ నిల్వలు పెరగవు. అంతేకాదు మీ శరీరం అనేక వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

■

స్నేహ గుణం ఎంతగా నీ బలహీనత అయితే అంతగా నిన్ను మించిన బలశాలి వుండడు

# చిరుధాన్యాల బియ్యం తయారుచేసే చిన్న యంత్రం!

దేశంలోనే తొలి 'స్మాల్ మిల్లెట్ టేబుల్ టాప్ ఇంపాక్ట్ హల్లర్ వి3' ని తమిళనాడుకు చెందిన స్మాల్ మిల్లెట్ ఫౌండేషన్ రూపొందించింది. ఇది. చిన్న చిరుధాన్యాల పైపొట్టు తీసి బియ్యం తయారు చేసుకోవడానికి ఉపయోగపడే చిన్న యంత్రం బరువు 30 కిలోలు. ముప్పావు మీటరు ఎత్తు, అర మీటరు పొడవు, అర మీటరు వెడల్పు ఉంటుంది. ఇంట్లో చిన్న టేబుల్ మీద పెట్టు కొని వాడుకోవచ్చు. మహిళలు, పిల్లలు సైతం ఉపయోగించడానికి అనువైనది. ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు. అతి తక్కువ 0.5 హెచ్ పి విద్యుత్తుతో పని చేస్తుంది. సింగిల్ ఫేజ్ విద్యుత్తు లేదా సౌర విద్యుత్తు లేదా పెట్రోలు మోటారు తోనూ నడుస్తుంది. 90% సామర్థ్యంతో పని చేస్తుంది. ఒకసారి మర పడితే 10% మెరికలు వస్తాయి.



రెండోసారి మళ్లీ మరపడితే వంద శాతం బియ్యం సిద్ధమవుతాయి. చిరుధాన్యం రకాన్ని బట్టి గంటకు 30 నుంచి 80 కిలోల ధాన్యాన్ని మర పట్టొచ్చు. ఏ రకం చిన్న చిరుధాన్యాన్నయినా ఈ యంత్రానికి ఎటువంటి మార్పులు చేయాల్సిన అవసరం లేకుండానే మర పట్టుకోవచ్చు. అర కేజీ ధాన్యం ఉన్నా సరే దీన్ని ఉపయోగించవచ్చు. తక్కువ శబ్దం చేస్తుంది. 2 గంటల తర్వాత ఓ గంట విరామం ఇవ్వాలి. దీని ధర రూ.88 వేలు (18% జిఎస్టీ అదనం).

కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికెలు వంటి చిన్న చిరుధాన్యాల (స్మాల్ మిల్లెట్స్) ధాన్యాన్ని వండుకొని తినాలంటే పైపొట్టు తీసి బియ్యం తయారు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్వం దంపుకొని చిరుధాన్యాల బియ్యం తయారు చేసుకునే వారు. ఇది చాలా శ్రమతో కూడిన పని.

కొన్ని సంవత్సరాలుగా మిక్సీలను ఉపయోగించి ఇంటి స్థాయిలో మిల్లెట్ బియ్యం తయారు చేసుకోవటం ప్రారంభమైంది. అయితే, మిక్సీకి ఉన్న పరిమితుల దృష్ట్యా వాణిజ్య దృష్టితో చిన్న చిరుధాన్యాల బియ్యం ఉత్పత్తి చేయ దలచిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలు, మహిళా స్వయం సహాయక బృందాలు, చిన్న వ్యా'రులు యంత్రాలను ఆశ్రయించక తప్పట్లేదు. యంత్రాల ధర అందుబాటులో లేని పరి స్థితుల్లో చిన్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ పెద్ద సంస్థలు, కంపెనీలకే పరిమతం అవుతూ వచ్చింది. ఇది గ్రామాల్లో పేద రైతులు, మహిళా బృందాలు, చిన్న వ్యా'కారులకు ఈ ప్రక్రియ పెద్ద సవాలుగా నిలిచింది.

ఈ సవాలును అధిగమించడానికి ఇంటి స్థాయిలో, గ్రామస్థాయిలో మహిళలు, పిల్లలు సైతం ఉపయోగించ డానికి అనువైన అనేక చిన్న యంత్రాల రూపుకల్పనలో అనేక ఏళ్లుగా విశేష కృషి చేస్తున్న తమిళనాడుకు చెందిన స్మాల్ మిల్లెట్ ఫౌండేషన్ (డెవలప్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ యాక్షన్ – ధాన్ ఫౌండేషన్ అనుబంధ సంస్థ) విజయం సాధించింది. ఈ సంస్థ రూపొందించిన చిన్న యంత్రాల్లో ఒకటి.. దేశంలోనే తొలి 'టేబుల్ టాప్ డీహల్లర్ మిషన్'. కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికెలు వంటి ఏ రకం చిరుధాన్యాలతోనైనా, అర కిలో అయినా సరే, ఈ యంత్రంతో బియ్యం తయారు చేసుకోవచ్చు.

ఇటువంటివే మరికొన్ని చిన్న యంత్రాలను ఈ ఫౌండేషన్ రూపొందించింది. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చిన మేలైన

(మిగతా 32వ పేజీలో )

**నిజాయితీ బాటలో నడవడంలో గొప్ప సౌకర్యం వుంది, ఆ దారిలో రద్దీ బాగా తక్కువ**

# పురుగు మందులు : నిజానిజాలు !

– కమలాకర్ రావ్

**మ**నలో చాలా మంది (90% రైతులు) ఒక రకం పురుగులపై ఒక టెక్నికల్ మందు పని చేస్తుంది అనగానే అందరూ అదే మందు గురించి ఎగబడి ఎక్కువ డబ్బులు పెట్టి అదే మందు మళ్ళీ మళ్ళీ రిపీటెడ్‌గా వాడటం వల్ల పురుగులకు నిరోధక శక్తి పెరిగి ఎంతకొట్టినా పురుగు చావడంలేదు. తరువాత సంవత్సరం మందులో పవర్ తగ్గించారు పనిచేయటం లేదు అంటారు.

అందుకే గమనించాల్సింది ఏమిటంటే ... గతంలో పనిచేసిన మందులు మళ్ళీ మళ్ళీ వాడితే పని చేయవు. ఇలా చేయడం వల్ల డబ్బు వృథా కావడమే కాకుండా మొక్కలు బలహీనపడి పురుగులు వ్యాధి నిరోధక శక్తిని పెంచు కుంటాయి. దీనికి పరిష్కారం ఏమిటి అంటే ముందు పురుగు మందుల గురించి కొన్ని వివరాలు తెలుసుకోవాలి.

ఒకొక్క మందు ఒకొక్క విధంగా పని చేస్తుంది. ఉదాహరణకు ఒకటి ఆకలి వేయకుండా చేస్తుంది, ఒకటి ఊపిరి ఆడకుండా చేస్తుంది, మరొకటి నరాల మీద పని చేస్తుంది. ఇలా అనేక రకాలు ఉన్నాయి.

ఇంగ్లీషులో దీన్ని మోడ్ ఆఫ్ యాక్షన్ అంటారు. మనకు ఇప్పటివరకు 30కి పైగా ఈ మోడ్ ఆఫ్ యాక్షన్ ఉన్నాయి. అంటే 30+ మందులు పురుగులని రకరకాలుగా చంపుతాయి

**పురుగు మందులు చాలా రకాలు ఉన్నాయి. వాటిలో కొన్ని...**

1. ఆర్గానోఫాస్ఫేట్స్ 2. పైరిత్రాయిడ్స్ 3. నియో నిక్టినోయిడ్స్ 4. స్పినోసిన్స్ 5. అవర్‌మెక్టిన్స్ 6. బెంజోల్యూరియస్ 7. దియామిడ్స్ ... ఇలా ఇంకా అనేక రకాలు ఉన్నాయి

**ఆర్గానోఫాస్ఫేట్స్ : 1.** మోనోక్రోటోఫాస్ 2. ఎసిఫేట్ 3. మలాథియాన్ 4. ఇథియాన్ 5. డైమిథోయేట్ 6. ఫోరేట్ 7. ప్రొఫెనోఫాస్

**పైరిత్రాయిడ్స్ :** 1. బిఫెన్‌త్రిన్ 2. సైలాత్రిన్ 3. లంబ్డా – సైలోత్రిన్ 4. డెల్టామిత్రిన్

**నియోనిక్డానోయిడ్స్ :** 1. ఇమిడాక్లోప్రిడ్ 2. థైయోమితాక్సమ్ 3. డైనోటిఫ్యూరాన్ 4. ఎసిటామిప్రిడ్ 5. థయాక్లోప్రిడ్

**స్పినోసిన్స్ :** 1. స్పైనాతోరమ్ 2. స్పైనోసాడ్

**ఎవమెక్టిన్స్ :** 1. అబామెక్టిక్ 2. ఎమామెక్టిన్ బెంజోయేట్

**బెంజోల్యురియాస్ :** 1. లూఫెన్యురాన్ 2. టెఫ్లోబెంజ్యూరన్ 3. నోవాలురాన్

**దియామైడ్స్ :** 1. క్లోరాంత్రనిలిప్రోల్ 2. స్యాన్‌త్రానిలిప్రోల్ 3. ఫ్లుబెండియామైడ్ 4. టెట్రానిలిప్రోల్

మనలో చాలామంది ఒకే మందు ఒక పంటకాలంలో రెండు సార్లు కంటే ఎక్కువ వాడకూడదు అని వినివుంటారు. అయితే ఒకే మందు కాదు ఒకే గ్రూప్‌కి చెందిన మందులు కూడా రిపీటెడ్‌గా వాడకూడదు. దీనివల్ల కూడా రెసిస్టెన్స్ వస్తుంది. ఉదాహరణకు తెల్లదోమకి రెండుసార్లు ప్రైడ్ కొట్టి తర్వాత అక్టారా గాని ఎడ్మైర్ కానీ కొట్టకూడదు. మొదట ఒక గ్రూప్ మందులు కొట్టాక మళ్ళీ కొట్టాలి అంటే కనీసం 45 నుండి 60 రోజులు ఆగాలి. ఈలోపు వేరే గ్రూప్ లోవి వాడుకోవాలి. లేదా జీవరసాయన పద్ధతులు గాని సేంద్రియ పద్ధతులు గాని వాడుకోవాలి.

ప్రస్తుతం తెల్లదోమకి సంబంధించి కొన్ని (ఇది కంప్లీట్ లిస్ట్ కాదు )

**గ్రూప్ 1బి :** 1. మోనో 2. రోగార్ 3. కురాక్రాన్

**గ్రూప్ 3ఎ :** 1. మార్కర్

**గ్రూప్ 4ఎ :** 1. ఎడ్మైర్, కాన్ఫిడార్, గౌచ్ 2. అక్టారా 3.ఓఫీస్ 4. మానిక్ 5. అలెంటో

**గ్రూప్ 4డి :** 1. సివాంటొ ప్రైమ్

**గ్రూప్ 7సి :** 1. ప్రుడెన్స్, లానో

**గ్రూప్ 9బి :** 1. సురుగా

**గ్రూప్ 9డి :** 1. సెఫీనా

**గ్రూప్ 12ఎ :** 1. పెగసెస్

**గ్రూప్ 16:** 1.అప్ లాడ్

# 5 వేలతో ప్రారంభించిన వ్యాపారం లక్షల టర్నోవర్

**పూజా**కాంత్ ఢిల్లీ నివసిస్తున్న ఓ సాధారణ మహిళ. ఆమె 2015 లో 'పూజా కి పొట్లీ' పేరుతో చిన్న వ్యాపారాన్ని ప్రారంభించారు. ఆమె మాక్రేమ్ ఆర్ట్ అంటే చేతితో తయారు చేసిన పర్యావరణ అనుకూల ఉత్పత్తులను తయారుచేసి విక్రయిస్తోంది. పూజ ఎంబీఏ పూర్తి చేసింది. ఆమె చాలా సంవత్సరాలు కార్పొరేట్ రంగంలో పని చేశారు. కానీ కొడుకు పుట్టాక 2012లో ఉద్యోగం మానేసింది. ఆమె తన బిడ్డకు ఎక్కువ సమయం ఇవ్వాలని నిర్ణయించుకుని ఉద్యోగం వదులుకుంది. వ్యాపారవేత్తగా ఎదిగింది.

ఇంట్లో ఖాళీగా కూర్చోవడం ఆమెకి నచ్చలేదు. 2015లో పూజా భర్త ఆమెకు స్మార్ట్ ఫోన్ ఇచ్చాడు. బోరు కొట్టకుండా ఉండాలంటే ఇంటి వ్యాపార ఆలోచన కోసం చూడమని ఆమె భర్త ఆమెను కోరాడు. పూజా ఈ కళను నేర్చుకునేందుకు ఎలాంటి శిక్షణ, వర్క్‌షాప్ చేయలేదు. అయితే యూట్యూబ్ చూసి నేర్చుకున్నట్లు పూజ తెలిపారు. అయితే ఆమెకు కళపై పూర్తి పట్టు సాధించడానికి రెండేళ్లు పట్టింది.

కళ పట్ల ఆమెకు ఉన్న ఇష్టం కారణంగా కుట్టు, ఎంబ్రాయిడరీ, నేత వంటి కళలలో ప్రావీణ్యం సాధించింది. ఉత్పత్తులను ఆకర్షణీయంగా తయారుచేశారు. ప్లాంట్ హ్యాంగర్లు, వాల్ హ్యాంగర్లు, బెడ్ రన్నర్‌లు, టేబుల్ రన్నర్‌లు మొదలైన అలంకార వస్తువులను తయారు చేసి విక్రయించడం మొదలు పెట్టారు. దీని ద్వారా ఆమె మరింత మంది మహిళలకు పని కల్పించారు.

2012లో ఉద్యోగం వదిలే సమయానికి పూజ జీతం నెలకు రూ.30 వేలు. 2015లో 'పూజా కి పొట్లీ'



ప్రారంభించినప్పుడు రోజుకు ఒకటి రెండు ఆర్డర్లు వచ్చేవి. అప్పట్లో రూ.5–6 వేలు సంపాదన వచ్చేది. కాలక్రమేణా ఇవి ప్రతి వారం సుమారు 100 ఆర్డర్‌లకు పెరిగాయి. ట్రావెల్ ఏజెన్సీని నడుపుతున్న ఆమె భర్త కూడా పూజకు ఆమె వ్యాపారంలో సహాయం చేయడం ప్రారంభించాడు. 2021 ఆర్థిక సంవత్సరంలో వెంచర్ ఆదాయం రూ. 20 లక్షలకు చేరుకుంది. ఆ తర్వాత 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.30 లక్షలకు పెరిగింది.

పూజా తన ఉత్పత్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తోంది. 'పూజా కి పొట్లీ' వెబ్‌సైట్‌తో పాటు, ఆన్‌లైన్ ఉత్పత్తులు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో, ఎట్సీ వంటి మార్కెట్‌ప్లేస్‌లలో కూడా విక్రయిస్తున్నారు. బ్రాండ్ కార్పోరేట్ ఆర్డర్‌లను కూడా పెద్దమొత్తంలో పొందుతుంది. ఆన్‌లైన్ మాధ్యమం ద్వారానే ఎక్కువ విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. ఆమె తన వ్యాపారాన్ని రూ.5 వేలతో ప్రారంభించినట్లు చెప్పారు.

■

---

**గ్రూప్ 21ఎ :** 1. హనాబీ

**గ్రూప్ 23:** 1. ముమెంటొ ఎనర్జీ 2. ఒబెరాన్

**గ్రూప్ 29:** 1. ఉలాల

**గ్రూప్ 30:** 1. ఎక్స్‌పోనస్ 2. సిమోడిస్

పై గ్రూప్స్ ఆధారంగా ఏది వాడుకోవాలి ఏ సమయంలో వాడుకోవాలి అనేది చూసి వాడుకోవాలి. వాడిందే మళ్ళీ మళ్ళీ వాడవద్దు. వాడిన గ్రూపులో మందులే వాడవద్దు. కొంత విరామం ఇవ్వండి, విరామ సమయం లో ఆర్గానిక్‌వి వాడుకోవాలి.

■

# పూచీకత్తు అవసరం లేకుండా రూ.10 లక్షల రుణం !

**భా**రత ప్రభుత్వం వివిధ పథకాలతో పారిశ్రామిక రంగాలకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. కార్పొరేట్, వ్యవసాయేతర చిన్న/సూక్ష్మ సంస్థలకు ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో 2015 ఏప్రిల్ 8న ప్రధాని నరేంద్ర మోదీ ప్రధానమంత్రి ముద్ర యోజన (పిఎంఎంవై) పథకాన్ని ప్రారంభించారు.

ఈ స్కీమ్ కింద కమర్షియల్ బ్యాంక్‌లు, ఆర్ఆర్‌బిలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు, ఎంఎఫ్ఐలు, ఎన్‌బిఎఫ్‌సిలు సహా వివిధ ఆర్థిక సంస్థల ద్వారా అర్హత కలిగిన వ్యక్తులకు రూ. 10 లక్షల వరకు గ్యారంటీ అవసరం లేని లోన్లు మంజూరు చేస్తారు?

**అర్హులు వీరే..**

మైక్రో యూనిట్స్ విభిన్న నిధుల అవసరాలను తీర్చడానికి, ముద్ర మూడు ప్రొడక్టులను ప్రవేశపెట్టింది. అవి శిశు, కిషోర్, తరుణ్ లోన్లు. శిశు కేటగిరీ కింద రూ. 50,000 వరకు, కిషోర్ విభాగంలో రూ. 50,000– రూ. 5,00,000 వరకు రుణాలు అందిస్తారు. అయితే తరుణ్ కింద అత్యధికంగా రూ. 5,00,000 నుంచి రూ. 10,00,000 వరకు లోన్‌లు అందిస్తారు. యువతలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ని ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా శిశు కేటగిరీ యూనిట్‌లపై ఫోకస్ చేశారు.

**50వేల నుంచి మొదలు..**

ముద్ర ఫండింగ్ రెండు విభిన్న పథకాల ద్వారా అందిస్తారు. మొదటిది మైక్రో క్రెడిట్ స్కీమ్ (ఎంసిఎస్). ఇది రూ. 1 లక్ష వరకు రుణాలను అందిస్తుంది. మైక్రోఫైనాన్స్ సంస్థల (ఎంఎఫ్ఐలు) ద్వారా సులభతరం చేస్తుంది.

రెండో స్కీమ్ రీఫైనాన్స్ స్కీమ్. ఇది వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్ఆర్‌బిలు), స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలకు (ఎన్‌బిఎఫ్‌సిలు) అందుబాటులో ఉంది. ఈ పథకం కింద, రుణాలు పొందడానికి ఈ క్రింద పేర్కొన్న అర్హతలు వుండాలి.

**ప్రధాన మంత్రి ముద్ర యోజన వివరాలు**

**కాంప్రహెన్సివ్ ఫైనాన్సింగ్**

తయారీ, వ్యాపారం, సేవలు, పౌల్ట్రీ, డైరీ, తేనెటీగల పెంపకం వంటి అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలు వంటి వివిధ రంగాలలో టర్మ్ లోన్‌లు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం పిఎంఎంవై రుణాలను అందిస్తుంది.

**అనువైన వడ్డీ రేట్లు**

ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి రుణ సంస్థల ద్వారా ముద్ర రుణాల వడ్డీ రేట్లు నిర్ణయిస్తారు. వర్కింగ్ క్యాపిటల్ కోసం, రుణగ్రహీత ఓవర్‌నైట్ హోల్డ్ చేసిన ఆధారంగా వడ్డీ వసూలు చేస్తుంది.

**లోన్ అమౌంట్**

మినిమం లోన్ రిక్వైర్‌మెంట్ లేనప్పటికీ, పిఎంఎంవై కింద లభించే గరిష్ట లోన్ మొత్తం రూ. 10 లక్షలు.

**ప్రాసెసింగ్ ఛార్జీలు**

ముద్ర రుణాల కోసం దరఖాస్తు చేసేటప్పుడు రుణగ్రహీతలు ఎటువంటి ప్రాసెసింగ్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. లేదా తాకట్టు అందించాల్సిన అవసరం లేదు.

**సెక్టార్ ఇన్‌క్లూజివిటీ**

పిఎంఎంవై వ్యవసాయేతర రంగంలో మాత్రమే కాకుండా ఉద్యానవన, మత్స్య పరిశ్రమ వంటి అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలలో పాల్గొనే సంస్థలకు కూడా రుణాలు ఇస్తుంది.

**వడ్డీ రేటు లెక్కింపు**

ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం, ముద్ర రుణాలపై వడ్డీ రేటు మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసిఎల్ఆర్) ఆధారంగా కాలిక్యులేట్ చేస్తారు.

గౌరవం రెండు విధాలుగా వస్తుంది ; అధికారంతో లేదా ప్రవర్తనతో ; మొదటిది తాత్కాలికం, రెండవది శాశ్వతం !

# మహిళల బ్యాంక్ ఖాతాలోకి రూ.3 లక్షలు!

**కేం**ద్ర ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోంది. ఇప్పటికే రైతులకు సంబంధించి పీఎం కిసాన్ యోజన పథకం ఎంతో పాపులారిటీ తెచ్చుకుంది. దీని ద్వారా రైతులు పెట్టుబడి సాయం కింద రూ.6 వేలు సంవత్సరానికి పొందుతున్నారు? అంతే కాకుండా.. మహిళలకు కూడా ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెడుతోంది. దీనిలో భాగంగా తాజాగా వారి కోసం మరో పథకాన్ని తీసుకొచ్చింది. దాని పేరు  ఉద్యోగిని యోజన పథకం. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

**ప్రధాన మంత్రి ముద్రా యోజన అర్హత ప్రమాణాలు**

దరఖాస్తుదారు తప్పనిసరిగా భారత పౌరుడై ఉండాలి. రుణం తీసుకోవడానికి అర్హత ఉన్న వ్యక్తులు, స్మాల్ బిజినెస్ ఎంటర్‌ప్రైస్ కోసం బిజినెస్ ప్లాన్ సిద్ధంగా ఉన్న ఏ వ్యక్తి అయినా పథకం కింద రుణాన్ని పొందవచ్చు. మాన్యుఫ్యాక్చరింగ్, ట్రేడింగ్, సర్వీస్ సెక్టార్స్‌లో ఇన్‌కమ్-జన రేటింగ్ యాక్టివిటీలకు, త్రీ లోన్ ప్రోడక్టులలో వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న కార్యకలాపాలకు లోన్‌లు పొందవచ్చు.

దరఖాస్తుదారు లోన్ డిఫాల్ట్ హిస్టరీని కలిగి ఉండకూడదు. దరఖాస్తుదారు బిజినెస్ కనీసం 3 సంవత్సరాల నుంచి బిజినెస్ చేస్తుండాలి. ఎంటర్‌ప్రెన్యూర్ 24 నుంచి 70 సంవత్సరాల వయస్సు గలవారై ఉండాలి.

**ఎలా దరఖాస్తు చేయాలి?**

ఆసక్తి గల దరఖాస్తుదారులు అధికారిక వెబ్‌సైట్ www.udyamimitra.in ఓపెన్ చేయాలి. హోమ్ స్క్రీన్‌పై అప్లై నౌ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయండి. న్యూ ఎంటర్‌ప్రెన్యూర్, ఎగ్జిస్టింగ్ ఎంటర్‌ప్రెన్యూర్, సెల్ఫ్-ఎంప్లాయ్డ్ వంటి ఆప్షన్‌ల నుంచి ఒకటి సెలక్ట్ చేసుకోండి. కొత్తగా రిజిస్ట్రేషన్ చేస్తుంటే, నేమ్ ఆఫ్ ది అప్లికెంట్, ఇమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ యాడ్ చేయండి. ఓటీపీని జనరేట్ చేయండి, రిజిస్టర్ చేసుకోండి.

ఈ పథకం వ్యాపారం చేయాలనుకునే మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వ్యాపార పెట్టుబడికి సంబంధించి లోన్ బ్యాంక్ అందజేస్తుంది. దాదాపు రూ.3 లక్షల వరకు లోన్ తీసుకోవచ్చు.




దీనిలో 30 శాతం కేంద్రం సబ్సిడీ కింద అంద జేస్తుంది. దీనికి 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. ఈ బ్యాంక్ రుణానికి వారు ఎలాంటి హామీ ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే.. ఈ పథకం ప్రయోజనాలను పొందేందుకు కొన్ని షరతులు ఉన్నాయి. కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలకు మించ కుండా ఉండాలి. ఒకవేళ ఆ మహిళ వితంతువు, దివ్యాంగు రాలు అయితే ఎలాంటి ఆదాయ పరిమితి లేదని పేర్కొన్నారు.

ఈ లోన్ కోసం మీరు ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇందుకోసం ఆధార్ కార్డు, బీపీఎల్ కార్డు, కుల ధృవీకరణ పత్రం వంటి పత్రాలను అందించాలి. ఈ పథకం ద్వారా కాకుండా బయట బ్యాంక్ లోన్ తీసుకుంటే.. తీసుకున్న దానికంటే కూడా వడ్డీతో పాటు రుణాన్ని ఎక్కువగా కట్టాల్సి వస్తుంది.

కానీ ఈ ఉద్యోగిని పథకంలో అలా కాదు. ఇందులో మీకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఇస్తోంది.

మీ దగ్గర్లోని ఏ బ్యాంక్‌లో అయినా రుణాన్ని తీసుకోవచ్చు. దీని కోసం ఆధార్ కార్డు, పాన్ కార్డు, అడ్రస్ ప్రూఫ్ లాంటి పత్రాలను బ్యాంకులో సమర్పించాల్సి ఉంటుంది.

# మన దేశంలో దారుణంగా రైతుల పరిస్థితి !

## 2022 అగ్రికల్చర్ మానిటరింగ్ రిపోర్ట్‌లో సంచలన సమాచారం

**తా**ము పండించిన పంటలకు కనీస మద్దతు ధర చెల్లించాలంటూ రైతులు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీలో వేలాది మంది పంజాబ్ రైతులు నిరసన కార్యక్రమాలను చేపట్టేరు. రైతులతో కేంద్రం జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. 2020, 2021లో కూడా కేంద్ర ప్రభుత్వంపై రైతులు ఇదే స్థాయిలో పోరాటం జరిపారు. గత ఆందోళనల సమయంలో కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లకు కొంత మేర తలొగ్గింది.

మరోవైపు రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్న దేశాలకు సంబంధించి 2022 అగ్రికల్చరల్ పాలసీ మానిటరింగ్ రిపోర్ట్ ఒక నివేదికను విడుదల చేసింది. చాలా దేశాల ప్రభుత్వాలు రైతుల వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేయడం, పంపిణీ చేయడంలో తమ సామర్థ్యాన్ని చాలా పరిమితంగా వినియోగించుకుంటున్నాయని నివేదికలో తెలిపింది. ఇండియాలో కూడా రైతులకు సరైన న్యాయం లభించడం లేదని పేర్కొంది. 2020 నుంచి 2022లో అమలు చేసిన పాలసీలు అంతర్జాతీయ మార్కెట్ల కంటే మన దేశ రైతులకు తక్కువ ధర లభించేలా చేశాయని తెలిపింది. భారత వ్యవసాయ పాలసీలు రైతులకు తీవ్ర అన్యాయం చేశాయని పేర్కొంది.

భారత ప్రభుత్వ పాలసీల ద్వారా 2022లో మన రైతులకు 163.6 బిలియన్ అమెరికన్ డాలర్ల నష్టం వాటిల్లిందని అంచనా వేసింది. ప్రభుత్వం తరపున రైతులు పొందిన సాయం, డిస్కౌంట్ల తర్వాత కూడా ఇంత మేర రైతులకు నష్టం వాటిల్లింది.

మన దేశంలో కష్టపడి పండిస్తున్న రైతులకు లభిస్తున్న మద్దతు −100.3 శాతం అంటే... పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇదే సమయంలో వినియోగదారులకు లభిస్తున్న మద్దతు 163.6 శాతంగా ఉంది. ఈ గణాంకాల ప్రకారం రైతన్నల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మన దేశంలో వ్యవసాయోత్పత్తుల వినియోగం భారీగా ఉన్నప్పటికీ రైతుల జీవితాలు మాత్రం మారడం లేదు. ఇదే సమయంలో వ్యవసాయోత్పత్తులను మార్కెట్ చేస్తున్న కార్పొరేట్ కంపెనీలు మాత్రం కళ్లు చెదిరే లాభాలతో దూసుకుపోతున్నాయి. చైనాలోని రైతుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. అక్కడ రైతులకు ప్రభుత్వ పరంగా మద్దతు 273 శాతంగా ఉంది. కానీ, వినియోగదారులకు మద్దతు ఘోరంగా ఉంది. ఈ విషయంలో అమెరికా రైతులకు అక్కడి ప్రభుత్వం 40.9 శాతం అండగా ఉంది. ■

## వర్షపు నీటి ప్రాముఖ్యత , నీటి శుద్ధీకరణపై అవగాహన

**గు**డిబండ మండల కేంద్రంలోని ఎఫ్‌పిఓ కార్యాలయంలో ఏపీమాస్, ఎఫ్‌పీఓ వారి ఆధ్వర్యంలో వర్షపు నీటి ప్రాముఖ్యత అలాగే కమ్యూనిటీ నీటి శుద్ధీకరణ ప్లాంట్‌పై రైతు సంఘాలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ఎలా నిలువ చేసుకున్న నీటిని ఏ విధంగా శుద్ధీకరణచేసి వినియోగించుకోవాలి. పెట్టు పంటలు, ఆరు తడి పంటల గురించి చిందు తుంపర సేద్యం ప్రాముఖ్యత గురించి, కమ్యూనిటీ నీటి శుద్ధీకరణ ప్లాంట్ నిర్వహణ గురించి రైతు సంఘాల లీడర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీమాస్ డైరెక్టర్ గోపాల్‌రాజు, కోఆర్డినేటర్ నాగరాజు. గుడిబండ కెనరా బ్యాంక్ మేనేజర్ లోకనాథ్ రెడ్డి, ఎఫ్.పి.ఓ.సి.సి దేవరాజు, ఎఫ్‌పిఓ సిబ్బంది డైరక్టర్లు, లీడర్లు పాల్గొన్నారు. ■

# ఉచిత సౌర విద్యుత్ పథకానికి దరఖాస్తు ఇలా...!

సౌర విద్యుత్ వినియోగం మరింత విస్తరించి సామాన్య పౌరులపై కరెంట్ ఛార్జీల భారం తగ్గించేలా 'పీఎం సూర్య ఘర్ : ముఫ్త్ బిజ్లీ యోజన" పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ఈ స్కీమ్‌తో దేశవ్యాప్తంగా కోటి ఇళ్ళకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందుకోసం pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరి దీనికింద 'రూఫ్ టాప్ సోలార్' కోసం ఎలా అప్లై చేసుకోవాలి...? ఆ వివరాలను వెబ్ సైట్‌లో పొందుపర్చారు.

**దరఖాస్తు ప్రక్రియ ఇలా..**

**స్టెప్ 1 :** ముందుగా ఈ పోర్టల్లో మీరు పేరును రిజిస్టర్ చేసుకోవాలి. ఇందుకోసం

- మీ రాష్ట్రం, విద్యుత్ సరఫరా చేసే కంపెనీని ఎంచుకోవాలి.
- మీ విద్యుత్ కనెక్షన్ కన్స్యూమర్ నంబరు, మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడీని ఎంటర్ చేయాలి.
- పోర్టల్‌లో ఉన్న నియమ నిబంధలను అనుగుణంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి.

**స్టెప్ 2 :** ఆ తర్వాత కన్స్యూమర్ నంబరు, మొబైల్ నంబరుతో లాగిన్ అవ్వాలి. అక్కడ 'రూఫ్ టాప్ సోలార్' కోసం అప్లై చేసుకోవాలి.

**స్టెప్ 3 :** దరఖాస్తు పూర్తి చేసి డిస్కమ్ నుంచి అనుమతులు వచ్చేవరకు వేచి చూడాలి. అనుమతి వచ్చిన తర్వాత మీ డిస్కమ్‌ని నమోదిత విక్రేతల నుంచి సోలార్ ప్లాంటును ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

**స్టెప్ 4 :** ఇన్సస్టలేషన్ పూర్తయిన తర్వాత, ఆ ప్లాంట్ వివరాలను పోర్టల్‌కు సమర్పించి నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.

**స్టెప్ 5:** నెట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేశాక, డిస్కమ్ అధికారులు తనిఖీలు చేస్తారు. అనంతరం పోర్టల్ నుంచి కమిషనింగ్ సర్టిఫికేట్ ఇస్తారు.

**స్టెప్ 6 :** ఈ రిపోర్ట్ పొందిన తర్వాత మీ బ్యాంకు ఖాతా వివరాలతో పాటు క్యాన్సిల్డ్ చెక్కును పోర్టల్లో సబ్మిట్ చేయాలి. 30 రోజుల్లోగా మీ ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది. ■

---

## చిరుధాన్యాల చిన్న యంత్రం

(26 వ పేజీ తరువాయి )

సాగు, శుద్ధి, విలువ జోడింపు పద్ధతులు, యంత్రాలపై నీతి ఆయోగ్ 'మిల్లెట్ సంకలనం'ను న్యూఢిల్లీలో ఇటీవల విడుదల చేసింది. స్మాల్ మిల్లెట్ ఫౌండేషన్ ప్రజలు, శాస్త్రవేత్తలు, రైతులు అవసరాల మేరకు తయారు చేసి అందుబాటులోకి తెచ్చిన చిన్న యంత్రాలను ప్రశంసిస్తూ ఒక కథనం ప్రచురించటం విశేషం.

**పోర్టబుల్ ఇంపాక్ట్ హల్లర్**

టేబుల్ టాప్ హల్లర్ కన్నా కొంచెం పెద్దది స్మాల్ మిల్లెట్ పోర్టబుల్ ఇంపాక్ట్ హల్లర్ (ఎస్.ఎం.ఎఫ్. వి2). ఇది గంటకు 100 నుంచి 500 కిలోల చిన్న చిరుధాన్యాలను ప్రాసెస్ చేస్తుంది. 1 హెచ్‌పి మోటారుతో త్రీఫేస్ విద్యుత్తుతో పని చేస్తుంది. బరువు 98 కిలోలు. మీటరు పొడవు, మీటరు ఎత్తు, ముప్పావు మీటరు వెడల్పు ఉంటుంది. ఎక్కువ గంటల పాటు వాడొచ్చు.

మహిళలు సైతం సురక్షితంగా, సులువుగా వాడటానికి అనువైనది. ఎస్.ఎం.ఎఫ్. వి2 ధర రూ. 1,68,000. (18% జిఎస్టీ అదనం). ఈ యంత్రాలపై ఆసక్తి గల వారు తమిళనాడులోని కృష్ణగిరి కేంద్రంగా పని చేస్తున్న స్మాల్ మిల్లెట్ ఫౌండేషన్ (ఎస్.ఎం.ఎఫ్.) సాంకేతిక విభాగం ఇన్‌ఛార్జ్ శరవణన్‌ను 86675 66368 నంబరులో ఇంగ్లీష్ లేదా తమిళంలో సంప్రదించవచ్చు. ■

ద్వేషించడం కాక ప్రేమించడం, అనుకరించడం కాక అనుసరించడం, పొగడడం కాక అభినందించడం నేర్చినవాడు వివేకి

# ఆంధ్రప్రదేశ్‌లో 46 లక్షల ఎకరాలు బీడు !

**ఓ**వైపు కరువు, మరోవైపు తుఫాన్‌తో గతేడాది అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. వర్షాభావంతో దాదాపు 46 లక్షల ఎకరాలు బీళ్లుగా మారగా, వేసిన పంటలూ చాలా చోట్ల దెబ్బతిన్నాయి. ఆ తర్వాత తుఫాన్ దెబ్బకు మరింత నష్టం జరిగింది. ఖరీఫ్‌లో అన్ని పంటల దిగుబడులు తగ్గగా.. రబీలోనూ ఏ మేరకు దిగుబడి వస్తాయో తెలియని పరిస్థితి. రైతులు తీవ్రంగా నష్టపోయి కష్టాల్లో ఉన్నారు. రాష్ట్రంలో 2023–24లో తీవ్ర వర్షాభావం కారణంగా వ్యవసాయం నిరాశాజనకంగా మారింది. పంటల సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. ఖరీఫ్, రబీ సీజన్లలో 46 లక్షల ఎకరాల్లో రైతులు పంటలే వేయలేకపోయారు.

ఖరీఫ్‌లో 89.37 లక్షల ఎకరాలకు గాను 62.45 లక్షల (73%) ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. దాదాపు 27 లక్షల ఎకరాల్లో విత్తనమే పడలేదు. రబీలో 57.5లక్షల ఎకరాలకు గాను 37.6 లక్షల (67%) ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. దాదాపు 20 లక్షల ఎకరాలు బీడుగా మిగిలి పోయాయి. రెండు సీజన్లలో వ్యవసాయశాఖ 146.87 లక్షల ఎకరాల్లో పంటల సాగు లక్ష్యంగా నిర్ణయించగా, కోటి ఎకరాల్లోనే సాగయ్యాయి. 2023 ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 440 మండలాల్లో వానలోటుతో చాలామంది రైతులు విత్తనమే వేయలేదు. మరికొందరు వేసిన పంటలకు నీటి తడులు అందించలేక అవస్థలు పడ్డారు. అయినా ప్రభుత్వం కరువు మండలాలు కేవలం 103 అనే ప్రకటించింది.

**అటు కరువు.. ఇటు తుఫాన్**

రాష్ట్రంలో ఓవైపు వర్షాభావంతో నష్టపోగా, మరోవైపు తుఫాన్‌తో పంటలు దెబ్బతిన్నాయి. సార్వా వరి కోతల ప్రారంభంలోనే మిచౌంగ్ తుఫాన్‌తో ధాన్యం రైతులు నష్టపోయారు. పత్తి, మిర్చి, పొగాకు, శనగ, ఉద్యాన రైతులూ నష్టాలు చవిచూశారు. రబీ సాగు మొదలైన సమయంలోనే తుఫాన్ రావడంతో అప్పటివరకు వేసిన విత్తనం దెబ్బతిని, మళ్లీ పంట వేసుకోవాల్సి వచ్చింది. నిరుడు కాలువలకు



సకాలంలో నీరు విడుదలకాని కారణంగా సార్వా వరి సాగు ఆలస్యమైంది. దాంతో వరి కోతలు ఆలస్యం కావడంతో దాళ్వా పంటకు వాతావరణం అనుకూలించక రైతులు వరి సాగు తగ్గించారు. దీంతో 2023–24లో దాదాపు 15 లక్షల ఎకరాల్లో వరిసాగు తగ్గింది. ఏపీలో ఇంత భారీగా వరి సాగు తగ్గడం గతంలో ఎప్పుడూలేదు. రాయలసీమలో వర్షాభావం వల్ల చిరుధాన్యాలు 3.50 లక్షల ఎకరాలు, అపరాలు 10 లక్షల ఎకరాలు, వేరుశనగ 11 లక్షల ఎకరాలు పైన తగ్గాయి. నూనెగింజలు, పత్తి, పొగాకు, చెరకు పంటలు కూడా తగ్గాయి.

ఖరీఫ్‌లో అన్ని పంటల్లోనూ దిగుబడులు తగ్గి రైతులు నష్టపోయారు. రబీ పంటలు ఏ మేరకు దిగుబడి వస్తాయో తెలియని పరిస్థితి. ఈ ఏడాది ప్రధాన పంటలే సాగు తగ్గడంతో లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తికి గండిపడింది. కరువు, తుఫాన్‌తో పంట నష్టపోయిన ప్రాంతాలను కేంద్ర బృందాలు పరిశీలించి నివేదికలు అందించినా, రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసినా.. రైతులకు నయాపైసా నష్టపరిహారం అందలేదు.

మిచౌంగ్ సమయంలో రాష్ట్రానికి దాదాపు 493 కోట్లు మంజూరు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. కరువు, తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నది.. కానీ ఇంతవరకు ఒక్క రైతుకూ సాయం అందలేదు. కనీసం పంట రుణాలు రీషెడ్యూల్ చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. ■

# రైతులకు ప్రతి నెలా రూ. 3000 పెన్షన్ పథకం !

**అ**న్నదాత సంక్షేమంకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు (స్కీమ్స్) తీసుకొస్తున్నాయి. కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డులు, కిసాన్ మాన్‌ధన్ యోజనతో మద్దతు అందిస్తున్న సంగతి తెలిసిందే. పీఎం కిసాన్ స్కీమ్ కింద అర్హులైన రైతులకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ. 6 వేలను 3 విడతల కింద నెలకు రూ. 2 వేల చొప్పున నేరుగా రైతుల అకౌంట్లలో వేస్తుంటుంది. ఇవి మాత్రం రైతులు వ్యవసాయం చేస్తున్నంత కాలం మాత్రమే అండగా ఉంటాయని చెప్పొచ్చు. వయసు పైబడిన తర్వాత ఎలాంటి ఆదాయ వనరు ఉండదు. ఈ నేపథ్యంలోనే వయసు పైబడిన చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పెన్షన్ పథకం మాన్‌ధన్ యోజన.

ఈ స్కీమ్ కింద 60 సంవత్సరాలు నిండిన రైతులు పెన్షన్ పొందొచ్చు. నెలకు కనీసం రూ. 3 వేల పెన్షన్ వస్తుంది. ఈ స్కీం విధివిధానాలను తెలుసుకుందాం.

**అర్హులు ఎవరు?**

18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న రైతులు ఈ స్కీంలో చేరడానికి అర్హులు. దేశంలో ఎక్కడైనా భూమి రికార్డుల్లో పేర్లు నమోదై వుండాలి. 2 హెక్టార్ల వరకు సాగు చేయగలిగిన భూమి కలిగి ఉండాలి. వారంతా ఈ పథకంలో పేర్లు నమోదు చేసుకోవచ్చు. పెన్షన్ మాత్రం 60 ఏళ్లు నిండాకే వస్తుంది. ఈఎస్ఐ స్కీమ్, నేషనల్ పెన్షన్ సిస్టమ్, ఈపీఎఫ్ఓ పరిధిలో ఉన్న వారు, ఇతర చట్టబద్ధ సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్నవారు, జాతీయ పెన్షన్ పథకం ఎంచుకున్న రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నత ఆర్థిక స్థితి కలిగిన వర్గాల వారు ఈ స్కీం కింద పెన్షన్ పొందేందుకు అర్హులు కారు.

**ఎంత కట్టాలి?**

రైతులు 60 సంవత్సరాలు వచ్చే వరకు ప్రీమియం కట్టాలి. ఆ తర్వాత నెలకు రూ. 3000 పెన్షన్ వస్తుంది. స్కీంలో చేరే వయసును బట్టి ప్రీమియం ఉంటుంది. రైతు చెల్లించే దానితో సమాన మొత్తం ప్రభుత్వం కూడా జమ చేస్తుంటుంది.

ఉదాహరణకు 18 సంవత్సరాల వయసులో రైతు నెలకు రూ. 55 చొప్పున తన వాటాగా చెల్లిస్తే.. కేంద్రం రూ. 55 కలిపి బీమా కంపెనీకి రూ.110 చెల్లిస్తుంటుంది. 18



సంవత్సరాల వారికి రూ. 55 ప్రీమియం కాగా... వయసును బట్టి ఇది పెరుగుతుంటుంది. 40 ఏళ్ల వయసులో ఈ స్కీంలో చేరితే నెలకు రూ. 200 చొప్పున కట్టాలి. ఈ స్కీంలో పేరు నమోదు చేసుకున్న రైతు చనిపోతే.. జీవిత భాగస్వామి పథకాన్ని కొనసాగించొచ్చు. 60 ఏళ్లు వయసు నిండాక రైతు మరణిస్తే.. అప్పుడు జీవిత భాగస్వామికి సగం పెన్షన్ అందిస్తారు.

(సమయం తెలుగు)

■

## 15 ఏళ్ళ లోపు బాలలకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్స

**జూ**బ్లీహిల్స్ అపోలో హాస్పిటల్ యాజమాన్యం వారు 2024 మార్చి 31 వరకు 0 నుంచి 15 సంవత్సరాల పిల్లలకు ఉచితంగా హార్ట్ సర్జరీలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు కాని మరి ఏ ఇతర కార్డుల అవసరం లేదు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌తోపాటు అన్ని రాష్ట్రాల వారు ఈ సదుపాయం వినియోగించుకోవచ్చు. 15 సంవత్సరాల పైబడిన వారు కూడా ఈ సేవలను ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా పొందవచ్చు.

సంప్రతించవలసిన నంబరు : 91774 17238

■


# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...

వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరువు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు

భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు-
కృంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు



## జీవనోపాధులపై....




NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-03-2024 ; Posting Date: 05 & 06-03-2024

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2024-26

## 'వాష్' ప్రాముఖ్యతపై ఎఫ్ పి ఓలకు ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు !


నల్లమాడ


సుగుటూరు గంగమ్మ


సోమల ఎఫ్ పి ఓలు


యాడికి


బోడుప్పల్


ఆలేరు ఎఫ్ పి ఓలు


తిరుమలగిరి


యాదగిరిగుట్ట


తంబళ్లపల్లె ఎఫ్ పి ఓలు


నాగాలాండ్ కు చెందిన ఇ సి ఎస్ సంస్థ సిబ్బందికి ఏపిమాస్ శిక్షణ


గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన

To ADDRESS



పరుగు పూర్తయింది .... !

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089